వార్త

ఆదివారం

2 ఫిబ్రవరి, 2025

చెక్కు చెదరని 'ఉక్కు' సంకల్పం!

తారాతీరం

ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఆయన నటిస్తున్న 'ది రాజా సాబ్' చిత్ర షూటింగ్ మెజారిటీ శాతం పూర్తి అయినట్లు సమాచారం. ఇక ప్రభాస్ నటిస్తున్న మరో సినిమాను దర్శకుడు హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ ఫిక్స్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ ఓ సైనికుడి పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే సమాచారం. అయితే, దీంతో పాటు ఆయన ఈ సినిమాలో బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వ్యక్తిగా కనిపించనున్నాడట. 'ఫౌజీ' చిత్ర షూటింగ్‌కు సంబంధించిన తరువాతి షెడ్యూల్ మధురై సమీపంలోని కారైకుడి ప్రాంతంలో జరగనుందట. దేవీపురం అగ్రహారం నేపథ్యంలో బ్రాహ్మణ కుటుంబానికి సంబంధించిన సీన్స్‌ను షూట్ చేయబోతున్నారట. ఈ షెడ్యూల్ ఇరవై రోజుల పాటు సాగనుందని చిత్ర వర్గాల టాక్. ఈ చిత్రంలో ఇమాన్వీ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించనున్నాడు.

'అఖండ 2' లో శోభన?

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబోలో వచ్చిన 'అఖండ' చిత్రం అద్భుత విజయాన్ని సాధించిన నేపథ్యంలో అఖండ 2 - తాండవపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించి పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకొని, రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమయింది. అది కూడా మహా కుంభ మేళాలో ప్రారంభం కావడం గమనార్హం. షూటింగ్ గురించి బోయపాటి మాట్లాడుతూ, అఘోర పాత్రలతో కూడిన సినిమా కావడంతో ఈ కుంభమేళాలో కోట్ల మంది భక్తులు, లక్షల మంది అఘోరాలు, నాగ సాధువుల మధ్య షూటింగ్ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అఘోరాలు, నాగ సాధువులను కలిశామన్నారు. కోట్ల మంది జనాల మధ్య సినిమా చిత్రీకరణ అంటే సాధారణ విషయం కాదని, ఇది చిత్ర యూనిట్‌కు ఒక ఛాలెంజ్ అనే చెప్పాలన్నారు. అయితే ఈ తాజా సినిమాలో మరో సీనియర్ హీరోయిన్ నటించనుంచుననట్లు తెలుస్తోంది. ఒకప్పటి హీరోయిన్ శోభన ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తుందని.. ఆమె పాత్ర ఓ సన్యాసిని అని టాక్ వినిపిస్తోంది. అంతే కాదు.. ఈ సినిమాలో శోభన పాత్రలో చాలా వేరియేషన్స్ కూడా ఉంటాయని సమాచారం. ఇప్పటికే పలు కీలక పాత్రల్లో ఇతర భాషల నటులను తీసుకోవాలని మూవీ మేకర్స్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త
2 ఫిబ్రవరి, 2025

మంచి ముత్యాలు

నవ్వు నాలుగు విధాల చేటు నాటి సామెత..
నవ్వు నలభై విధాల గ్రేటు నేటి 'నా'నుడి

కదంబం

'సంఘీ'భావం....5
భయాందోళనల్లో గిరిజన తండాలు
కవర్ స్టోరీ..6
చెక్కు చెదరని 'ఉక్కు' సంకల్పం!
మార్పు.. 11
ఈ వారం కవిత్వం...12
అరిషడ్వర్గాలు
సహజీవన సంస్కృతి... 18
కథ..20
పునర్జన్మ
సాహిత్యం...23
ఏదీ! తెలుగు?
నిరాడంబరం అంటే?... 24
అరుదైన జంతువు.. 28
ఇంకా...
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

తాజా వార్తలు

'నో ఫుట్‌వేర్ విలేజ్'

ఇంట్లో నుంచి అడుగు బయటపెడితే చెప్పులు వేసుకుంటాం. కొంత మంది ఇంట్లో కూడా వేసుకునే తిరుగుతారు. కానీ తమిళనాడులోని వెల్లగాని అనే గ్రామంలో అడుగు పెట్టాలంటే ముందుగా కాళ్లకు చెప్పులు లేకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఆ గ్రామం 'నో ఫుట్‌వేర్ విలేజ్' కాబట్టి. కొడైకెనాల్‌కు సమీపంలో ఉన్న ఈ గ్రామంలో ఎవరూ చెప్పులు వేసుకోరు. ఈ ఊరిని పవిత్ర గ్రామంగా పిలుస్తారు. ఇక్కడ ఇళ్ల కంటే దేవాలయాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఎవరైనా చెప్పులు వేసుకుని తిరిగినట్లు కనిపిస్తే బయటకు పంపిస్తారు. ట్రెక్కింగ్‌కు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. చాలా మంది

ఔత్సాహికులు ట్రెక్కింగ్ చేస్తూ ఈ ఊరికి చేరుకుంటారు. కొడైకెనాల్ నుంచి 9 కి.మీ. దూరంలో ఉంది 'వెల్లగావి'. గ్రామంలోకి ప్రవేశించక ముందే చెప్పులు వదిలేయాలి. ఈ గ్రామానికి 300 యేళ్ల చరిత్ర ఉంది. అయితే ఇప్పటికీ అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు.

పోర్చుగల్ ముక్క

ఒక్కసారైనా పోర్చుగల్ వెళ్లి రావాలనే కోరిక ఉందా? బడ్జెట్ లేక ఆగిపోయారా? అయితే మహారాష్ట్రలోని 'కొర్లాయ్' గ్రామానికి వెళ్లండి. మన దేశంలోనే పోర్చుగల్ ఛాయలను ముక్కికి ముక్కీగా చూడొచ్చు. ఒకప్పుడు పోర్చుగీసు వారి వలస పాలనలో ఉండేది ఈ గ్రామం. పోర్చుగల్‌లో కనిపించే రంగు రంగుల ఇళ్లు కొర్లాయ్‌లోనూ కనిపిస్తాయి. గ్రామస్థులు పోర్చుగీసు భాషలోనే మాట్లాడు కుంటారు. వంటలు కూడా

పోర్చుగల్ వాసనలు వెదజల్లుతాయి. ఒకప్పుడు మహారాష్ట్రలోని కొర్లాయ్ నుంచి గుజరాత్‌లోని డామన్ వరకు తీర ప్రాంతమంతా పోర్చుగీసుల నియంత్రణలో ఉండేదని చెబుతారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

చిన్నారుల ప్లేటులో పాండాలు

చిన్నారులకు అన్నం తినిపించడానికి అమ్మలు ఎన్ని కష్టాలు పడతారో చెప్పలేం! ఆకాశంలోని జాబిల్లిని.. గోడ మీది పిల్లిని చూపించి.. గబుక్కున రెండు ముద్దలు పెట్టేస్తుంటారు. ఆ తర్వాత కథ మళ్లీ మొదటికే వస్తుంది. ఇలాంటి ఇబ్బంది లేకుండా మిన్ కియన్‌జిన్ అనే ఓ కొరియన్ తల్లి.. అన్నం, ఇతర ఆహారాలను అందమైన జంతువులు, ఇతర బొమ్మల్లా మలచడం మొదలుపెట్టింది. వీటిని పిల్లలు పేచీలేకుండా తినేస్తున్నారట. అంతేకాదు.. తనలాగే ఇబ్బందిపడుతున్న ఇతర తల్లులకూ ఈ కళను నేర్పిస్తోంది మిన్.



‘సంఘీ’ భావం

భయాందోళనల్లో గిరిజన తండాలు

అటవీ ప్రాంతంలో ప్రకృతిపై ఆధారపడి జీవనం సాగించే గిరిజన తండాలు భయాందోళనల్లో జీవనం సాగిస్తున్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిన మేరకు గత కొంత కాలంలో ఎన్‌కౌంటర్లతో అటవీ ప్రాంతం మారుమోగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మిలట్రీ బలగాలు రంగంలోకి దిగాయి. అధునాతన సాంకేతిక సమాచార వ్యవస్థను రూపకల్పన చేసుకుని కదనరంగంలోకి దిగాయి. రాష్ట్ర పోలీసులను ఎదుర్కొని తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చిన మావోయిస్ట్ దళాలు మిలటరీ బలగాల తాకిడికి విచ్ఛినం అవుతున్నాయి. గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న కగార్ ఆపరేషన్ ధాటికి సుమారు 250 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాసారు. అనేక దళాలు కనుమరుగు అయ్యాయి. ఎన్‌కౌంటర్ల తాకిడికి కొందరు ఉద్యమపంథా నుంచి బయటపడి పోలీసుల ముందు లొంగిపోయారు. మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు మూడు వేల మంది సిఆర్‌పిఎఫ్ బలగాలు, కోబ్రా బృందాలు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ప్రతి 5 కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అన్ని రహదారుల్లో ప్రస్తుతం చెక్‌పోస్టులు 24 గంటల పాటూ కొనసాగుతున్నాయి. వాహనాలను, పాదచారులను తనిఖీలు చేస్తున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా వారిని అదుపులో తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారణ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుమారు 300 మందిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. మావోయిస్ట్ నేత హిడ్మా స్వగ్రామం ఛత్తీస్‌ఘడ్ సుక్మాజిల్లాలోని పువర్తి గ్రామంలో సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయగలిగారు. ఒకప్పుడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అటవీ ప్రాంతం మావోయిస్టులకు పెట్టనికోటగా ఉండేది. పోలీసులు మావోయిస్టులను గాలించడానికి వెళ్లేవారు కాదు. అయితే ప్రస్తుతం అధునాతన సాంకేతిక సమాచార వ్యవస్థను రూపొందించుకుని సిఆర్‌పిఎఫ్. కోబ్రా బలగాలు అటవీ ప్రాంతంలోకి సునాయసంగా వెళ్లగలుతున్నారు. శాటిలైట్ ద్వారా అటవీ ప్రాంతంలో మావోల కదలికలను గుర్తిస్తున్నారు. అనంతరం డ్రోన్లను ఉపయోగించి మావోయిస్ట్ క్యాంప్‌లను పసిగడుతున్నారు. దీనికి తోడు అధునాతన డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఈ డ్రోన్లు గాలిలో పైకి, కిందకు కదిలినప్పుడు మినహా మిగిలిన సమయంలో ఎటువంటి చప్పుడు చేయవు. దీనితో ఆకాశంలో ఎగురుతూ వచ్చే డ్రోన్లను మావోయిస్టులు గుర్తించలేకపోతున్నారు. ఈ డ్రోన్లు మావోయిస్టులు బస చేసిన క్యాంపులను గుర్తించడంతో పాటు అందులో ఎవరు ఉన్నారు, ఎంత మంది ఉన్నారు. వీరికి దగ్గర ఆయుధ సామాగ్రి ఏమేరకు ఉంది అన్న వివరాలను స్పష్టంగా సిఆర్‌పిఎస్ దళాలకు అందిస్తాయి. అదే విధంగా అక్కడి శిబిరంలో ప్రముఖ మావోయిస్టులు ఎవరెవరు ఉన్నారన్న సమాచారం వారి ఫొటోలతో సహా డ్రోన్లు అందిస్తుంటాయి. మరో పక్క అవసరమైతే హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. దీనితో మావోయిస్టులు బస చేసిన ప్రాంతాలను చుట్టు ముట్టి పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. ఆధునిక ఆయుధ సంపత్తిని కూడా కేంద్ర ప్రభుత్వం సిఆర్‌పిఎఫ్ బలగాలకు అందించింది. ఒక పక్క పోలీసులు ఆయుధాలతో అటవీ ప్రాంతంలో జల్లెడ పడుతుండగా మావోయిస్టులు బసచేసే సురక్షిత ప్రాంతాలను గుర్తించేందుకు గతంలో మావోయిస్టులుగా పనిచేసి లొంగిపోయిన వారిని ప్రయోగిస్తున్నారు. వీరిలో కొందరికి పోలీసు శాఖ, అటవీ శాఖలో ఉద్యోగాలు ఇవ్వడంద్వారా వారి నుంచి మావోల సమాచారం రాబట్టగలుతున్నారు. గతంలో సల్వాజుడంను రూపకల్పన చేసి కొన్ని సమస్యలు ఎదురు కావ డంతో వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం అందులో సభ్యులను పోలీసు, అటవీ శాఖలో ఉద్యోగులుగాను, కాంటాక్స్ ఉద్యోగులుగా నియమించుకుని కగార్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నారు. మావోయిస్టులను పట్టుకోవడానికి తమ తండాకు చెందిన యువకులనే ఉపయోగించడం గిరిజనుల్లో ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల వేధింపులు తట్టుకోలేక మావోయిస్టల సమాచారం అందిస్తే మావోయిస్టులు బహిరంగంగా హత్యలు చేస్తున్నారు. పోలీసుల సమాచారాన్ని మావోయిస్టలకు ఇస్తే పోలీసుల నుంచి సమస్యలు ఎదురౌతున్నాయి. గ్రామంలోకి పోలీసులు వచ్చినా, మావోయిస్టులు వచ్చినా గిరిజనులు ఆందోళనకు గురౌతున్నారు. మావోయిస్టలపై వత్తిడి పెరగడంతో ఆర్థికపరమైన వెసులుబాటు అందడం లేదు. అదేవిధంగా ఆధునిక ఆయుధ సామాగ్రి కూడా సమకూర్చుకోలేని పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొంతకాలం పాటు స్థబ్ధుగా ఉండాలని వ్యూహం పన్నుతున్నట్లు తెలుస్తోంది. కగార్ ఆపరేషన్ తగ్గుముఖం పట్టిన తరువాత తిరిగి అటవీ ప్రాంతా నికి వెళ్లడం సరైన నిర్ణయంగా మావోయిస్టులు భావిస్తున్నాట్లు సమాచారం. తమ తండాలో ఏదైనా ఉపద్రవం జరుగుతుందా అన్న భయాందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అటవీ సంపదపై ఆధారపడి జీవనం సాగించే గిరిజనులకు ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణలో జరుగుతున్న ఆపరేషన్లు ఇబ్బందికరంగా పరిణమించాయి. మావోయిస్టల వేటలో పోలీసులు తమ గ్రామాలపై దాడులు చేయడం నిలిపివేయాలని గిరిజనులు కోరుతున్నారు. పోలీసులు మావోయిస్టల మధ్య తాము నలిగిపోతున్నామని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే 2026 నాటికి మావోయిస్టలను పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్రం ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయో వేచిచూడాల్సి ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

చెక్కు చెదరని 'ఉక్కు' సంకల్పం!

కవర్ స్టోరీ

వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదం తెలుగు వారిలో ఏనాడు ఊపిరి పోసుకుందో కానీ దానికి ఈ భూమి ఉన్నంతవరకు చావే ఉండదని తేలిపోయింది. భారతీయ ఉక్కు రంగానికే తలమానికంగా నిలబడగల సత్తా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారం ఎన్నో ఒడుదొడుకులను తట్టుకొని ఇప్పుడు మళ్లీ తలెత్తుకుని నిలబడే స్థాయికి చేరుకుంది.

నిజానికి ఉక్కు ఫ్యాక్టరీ పుట్టుకే ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని తాడికొండ నియోజక వర్గ దళిత ఎంఎల్ఏ అమృతరావు నిరాహార దీక్షా ఫలం. మరి కొందరి త్యాగ ఫలం. ఉక్కు ఫ్యాక్టరీ సాధన ఉద్యమంలో 17మంది అసువులు బాసారు. వారి త్యాగం ఈ తెలుగు నేల మరువదు. ఆరు దశాబ్దాల నాడు అక్టోబరు 14న అమృతరావు చేసిన శాంతియుత నిరసన నిరాహార దీక్ష ఉవ్వెత్తున ఎగసి తీవ్ర ఉద్యమం అయింది. పర్యవసానంగా, ఆయన 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదానికి సార్థకత లభించింది. అదే నినాదం ఇప్పటికే ఆంధ్రా ప్రజానీకంతో మమేకం అయింది. అదే ఆనాడైనా, ఈనాడైనా పెద్ద ఉద్యమానికి దారితీసింది. అప్పటి విశాఖ పట్టణం లోక్‌సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కమిటీలు ఏర్పడగా, పట్టణాలలో నిరాహార దీక్షా శిబిరాలు ఏర్పాటయ్యాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం నేతృత్వంలో విద్యార్థులంతా తీవ్ర నిరసనల బాటపట్టారు. 1966 నవంబర్ 3న, కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఈ ప్రతిపాదనను అంగీకరించింది. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చార్టర్డ్ విమానంలో విశాఖపట్నం చేరుకుని, అమృతరావుకు ఒక గ్లాసు నారింజ రసం అందించి, నిరాహార దీక్షను విరమింపచేసారు.

నాటి ప్రధాని ఇందిరా గాంధీ లోక్‌సభలో దేశంలోని ఐదవ ఉక్కు కర్మాగారాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

విశాఖ ఉక్కు కర్మాగారం గురించి చెప్పుకోవాలంటే-

నూటికి నూరు శాతం 100 కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ. సాలీనా 73 లక్షల టన్నుల ద్రవ ఉక్కు తయారీ సామర్థ్యంతో ఉన్న ఈ సంస్థకు రూ.7,686,24 కోట్ల ఆస్తులు, రూ.26,114.92 కోట్ల అప్పులు ఉన్నాయి. 2023 మార్చి 31 నాటికి సంస్థ నెట్‌వర్త్ మైనస్ రూ.4,538 కోట్లకు పడిపోయింది. బ్యాంకుల్లోతీసుకున్న అప్పులు కూడా చెల్లించ లేని పరిస్థితి ఉండ టంతో, మూలధన వ్యయం కోసం బ్యాంకులు రుణాలివ్వడం మానేసినందున కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేదు.

ప్రైవేటీకరణ దిశగా అడుగులు

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆర్ఐఎన్ఎల్) ను ప్రైవేటీ కరణకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడంతో స్టీల్ ప్లాంట్లోని ఒక్కో భాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు అడుగులు పడ్డాయి. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్కటిగా చర్యలు చేపట్టింది. అప్పటికే దాదాపు 2 వేల మంది ఉద్యోగు లను ఛత్తీస్‌గఢ్‌లోని నాగరనర్ స్టీల్ ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వడం ఆపేసింది. అయినా కార్మికుల పోరాటంతో యాజ మాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్, ఆక్సిజన్ ప్లాంట్లను నిలిపివేసింది. మరోసారి కార్మికుల ఆందోళనతో వెనకడుగు వేయక తప్పలేదు. ఇక ఏమైనా వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి. తాజాగా స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఒక యూనిటిను ప్రైవేట్ పరం చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఆర్ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్మెల్ట్ షాప్, బ్లాస్ఫర్నేస్ రోలింగ్ మిల్స్,

ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్పీజీ స్టోరేజ్ ట్యాంకులు, వాటర్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్, స్టీల్ ప్లాంట్ని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది.

ఆందోళనలు-హర్షాతిరేకాలు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ 9,460 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు, 12 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు. వీరికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వటంలేదు. సెప్టెంబరులో 50 శాతం, అక్టోబర్ 25శాతం, నవంబరులో 25శాతం, డిసెంబరు లో 35 శాతం మాత్రమే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగైదు నెలల నుంచి పూర్తి స్థాయి జీతాలు ఇవ్వటం లేదు. హెచ్ఆర్పి, ఎల్టీసీ, ఎల్ఎల్టీసీ, దసరా, దీపావళి బోనస్ను పూర్తిగా ఆపేశారు. వేతన సవరణ జరగ లేదు. కార్మికులను సాగనంపే ప్రయత్నం ముమ్మరంగానే సాగింది.

వీఆర్ఎస్కు షురూ!

వీఆర్ఎస్ పథకం అమలుకు ఆర్ఎన్ఎల్ నోటిఫికేషన్లో 45 ఏళ్ల వయసు, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారికి తొలుతగా అవకాశమిచ్చింది. అదే సానుకూలపడితే మార్చి 2025లోపు వెయ్యి మందిని బయటకు పెంపేందుకు యాజమాన్యం సిద్ధమైంది. సాధారణంగా గత ఐదేళ్లుగా ప్రతి ఏటా 1000 నుంచి 1,100 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. వారి స్థానంలో నియామకాలు జరపక పోవడాన్ని బట్టి చూస్తే ప్రైవేటీకరణకు సిద్ధమైనట్లు తెలు స్తోందని, ఆ దిశగా అడుగులు పడుతున్నాయని సీఐటీయూ నేత కే.ఎం. శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలివ్వటం లేదు. మరోవైపు బలవంతంగా వీఆర్ఎస్కు పంపిస్తున్నారు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని విశాఖ ఉక్కు కార్మికులు

అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరాశా నిస్పృహల మధ్య కొట్టు మిట్టాడుతుండగా శుభవార్త చెవిన పడింది. పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటన వెలువడినా 600 మంది ఉద్యోగులు తమ వీఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్నారు.

పునరుద్ధరణ ఇలా..

కేంద్రం ఈక్విటీ రూపంలో రూ.10,300 కోట్లు సమకూరుస్తోంది. అయినా ప్రస్తుత ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి, దశల వారీగా పూర్తి సామర్థంతో ఉత్పత్తి మొదలు పెట్టడానికి ఆస్కారం ఉంది. తక్షణమే ప్లాంట్ లోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్లు పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థంతో పని చేస్తాయి. ఆగస్టు నాటికల్లా మూడు బ్లాస్ట్ ఫర్నేస్లు నిర్విరామంగా ఉక్కు ఉత్పత్తి చేస్తాయి. 1996లో ఒకసారి విశాఖ ఉక్కు తీవ్ర నష్టాల్లో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కూడా తగు మొత్తంలో భారీ ప్యాకేజీ అందించారు. నేడో రేపో దొడ్డిదారిన నెమ్మదిగా ప్రైవేటుకు వెళ్ళిపోతుందని భావిస్తున్న తరుణంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రం ప్రకటించిన భారీ ప్యాకేజీతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఇప్పుడు రాష్ట్రానికి అమరావతి, పోలవరంతో పాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సజీవంగా ఉండడమూ అంతే ముఖ్యం. ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన్నప్పటి నుంచి ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగుల కంటికి నిద్ర పట్టలేదు. ఏ క్షణాన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చెబుతుందోనని ఆందోళన పడిన రోజులే ఎక్కువ.

ఎలాంటి ఒడుదొడుకులూ లేకుండా ప్లాంటును పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థంతో నడిపించేందుకు రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ సమకూర్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. ఇకపై విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అన్న ఊసే ఉండదని, అలాంటి అభిప్రాయాన్ని కొట్టి పారేసిన కేంద్ర మంత్రి కుమారస్వామి విజ్ఞప్తితో వారి మనసుల్లో ప్రధాని నరేంద్ర మోడీపై కృతజ్ఞతా భావం వ్యక్తమైంది. ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే నంబరు 1 చేర్చే దిశగా ప్రయత్నాలు

మొదలయ్యాయని చెప్పడానికి ఇది అంకురార్పణ భావించాలి. ఈ ప్యాకేజీలో రూ.పదివేల 300 కోట్లు ఈక్విటీ కేపిటల్‌గా, 11,140 కోట్ల వర్కింగ్ కేపిటల్‌గా సమకూరుస్తున్నారు. అయితే లోను 7 నాన్ క్యుమిలేటివ్ ప్రిఫరెన్స్ షేర్ కేపిటల్‌గా సమకూరుస్తున్నారు. ఆర్ఐఎన్ఎల్ యథాతథంగా నడవడానికి వీలుగా ఈ మొత్తాన్ని పదేళ్ళలో రిడీమ్ చేస్తారు.

ఉక్కుకే ఉక్కు లాంటి విశాఖ ఉక్కు!

“ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఉక్కు రంగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ముందడుగు వేస్తున్నాం” ఇది “ఎక్స్” లో భారత ప్రధాని నరేంద్ర మోడీ!

వైజాగ్ స్టీల్ ప్లాంట్స్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మరీ పునరుద్ధరణ ప్యాకేజీని సాధించారు.

2023 మార్చి 31 నాటికి సంస్థ నెట్వర్త్ మైనస్ రూ.4,538 కోట్లకు పడిపోయింది. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు కూడా చెల్లించలేని పరిస్థితి ఉండటంతో మూల ధన వ్యయం కోసం బ్యాంకులు రుణాలివ్వడం మానేసి నందున కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేదు. కేంద్రం ఈక్విటీ రూపంలో రూ.10,300 కోట్లు సమకూరుస్తోంది. అయినా ప్రస్తుత ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి, దశల వారీగా పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి మొదలు పెట్టడానికి ఆస్కారం ఉంది. తక్షణమే ప్లాంట్‌లోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పని చేస్తాయి. ఆగస్టు నాటికల్లా మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నిర్విరామంగా ఉక్కు ఉత్పత్తి చేస్తాయి.

1996లో ఒకసారి విశాఖ ఉక్కు తీవ్ర నష్టాల్లో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా తగుమొత్తంలో భారీ ప్యాకేజీ అందించారు. అయినా కర్మాగార నిర్వహణలో యాజమాన్య లోపం వలన నష్టాల్లోకి చేరిందన్న అభియోగాలు న్నాయి. ఎన్నో సంవత్సరాలు లాభాలు గడించిన సందర్భాలూ ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఉక్కు ఫ్యాక్టరీకి నిలబెట్టేందుకే భారీ ప్యాకేజీ ఇచ్చారన్న విషయం కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి తేటతెల్లం చేయడంతో ఉక్కు కర్మాగారం ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు నిండాయి. నేడో రేపో దొడ్డిదారిన నెమ్మదిగా ప్రైవేటుకు వెళ్ళిపోతుందని భావిస్తున్న తరుణంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రం ప్రకటించిన భారీ ప్యాకేజీతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఇప్పుడు రాష్ట్రానికి అమరావతి, పోలవరంతో పాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సజీవంగా ఉండడమూ అంతే ముఖ్యం.

ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించి న్నప్పటి నుంచి ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగుల కంటికి నిద్ర పట్టలేదు. ఏ క్షణాన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చెబుతుందోనని ఆందోళన పడిన రోజులే ఎక్కువ.

ప్రభుత్వ రంగ సంస్థగా విశాఖ ఉక్కు కర్మాగారం మనజాలదని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్ణయించుకున్నాకనే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణకు అప్పగించాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు పెద్ద యుద్ధమే నడిచింది. ఫ్యాక్టరీ కార్మికులు ఎన్నో ఆందోళనలు కార్మికులు నిరసనలు ఆవేదనలో ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జీవం పోసుకున్నాక ఈ ఉక్కు కర్మాగారం మనుగడపై ప్రభుత్వ పెద్దలలో అంచనాలు, ఆలోచనలు మారాయి.

విశాఖ ఉక్కు, మరో రెండు ఉక్కు కర్మాగారాలకు ఊపిరి!

ఈ భూమి ఉన్నంత వరకు 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు'గా నిలిచే ఉంటుందన్న ఆశాభావం తెలుగు వారిలో వ్యక్తమవుతోంది. దీని వెనుక వేరొక కారణం కూడా ఉంది. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పడిన నాటి పరిస్థితులకు ఇప్పటికే అనేక పరిస్థితులు మారాయి. అవన్నీ తెలుగు జాతి ప్రగతికి అనుకూలమే. కాగా కేంద్ర ప్రభుత్వం వేరేలా ఆలోచించింది. జాతి ఆలోచనలు ముందుకు సాగితే ఈసరికే తెలంగాణ ప్రాంతంలోని బయ్యారంలో, రాయలసీమ ప్రాంతంలో కడపలో ఒక ఉక్కు కర్మాగారం ఏర్పడేవే. కాగా వాటికి ఏర్పాటుకు పురిట్లోనే సంది కొట్టాయి.

విశాఖ ఉక్కు పునరుద్ధరణ నిర్ణయం జరిగాక ఇప్పుడు తెలుగు జాతిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆ దిశగా నమ్మకం కలిగించే స్థాయికి కూటమి ప్రభుత్వం నిర్ణయాలు దారితీసి ముందడుగు వేయడం ఆహ్వానించదగిన పరిణామం.

సెయిల్‌లో కలిపితే ఇంకా భేష్!

అయినా ఎక్కడో ఎందుకో కార్మికుల్లో గూడుకట్టుకుని ఉన్న అశాంతి ఇంకా తొలగినట్లు లేదు. కార్మిక సంఘాల్లో ఉన్న సందేహాలకు సమాధానం దొరికినట్లు లేదు. ప్యాకేజీలు తాత్కాలిక ఉపశమనమే తప్ప సమగ్రాభివృద్ధికి ఏమాత్రం కలిసి రావని వారి అంచనా. అయితే నిధుల సమృద్ధి విషయంలో అది కాలాల పాటు ఫ్యాక్టరీ నడపగల శక్తి సామర్థ్యాలను సమృద్ధిగా సమకూర్చాలన్న విజ్ఞప్తులు ఎప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయనే ఉద్దేశంతో కార్మిక లోకం శషబిషలతో ఇంకా పూర్తిగా ఊపిరి పీల్చుకున్నట్లు లేదు. విశాఖ స్టీల్ ప్లాంటు కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం కాప్టివ్ మైన్స్ కేటాయించి సెయిల్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం ఒక్కటే శాశ్వత పరిష్కార మార్గంగా కనపడుతోంది. మరోసారి కార్మిక ఉద్యమానికి ఆస్కారం ఇవ్వని రీతిలో విశాఖ ఉక్కును రక్షించాలి!

> "వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఒక కర్మాగారం కంటే ఎక్కువ. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల పోరాటాలు, స్ఫూర్తికి స్మారకచిహ్నంగా నిలుస్తుంది. అందరి హృదయాలలో ముఖ్యంగా వైజాగ్ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఇది కేవలం ఎన్నికల హామీ కాదు. ప్రధాని మోడీ స్టీల్ ప్లాంట్‌కు అచంచలమైన మద్దతు ఇచ్చినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.
> ఇది వికసిత్ భారత్– వికసిత్ ఆంధ్రలో భాగంగా ప్రధానమంత్రి మోడీ జాతి నిర్మాణం, దార్శనికతకు ఇది దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయి."
>
> –సిఎం చంద్రబాబు నాయుడు

జవసత్వాల బాధ్యత కేంద్రానిదే!

విశాఖ ఉక్కు ఉక్కు కర్మాగారానికి అవసరమైనప్పుడల్లా నిధులు సమకూరుస్తామే తప్ప, ప్రభుత్వ అజమాయిషీ నుంచి తప్పించబోమని కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి శ్రీనివాస వర్మ ప్రకటించారు. అంతేకాదు, ఎట్టి పరిస్థితుల్లోనూ 'సెయిల్'లో కలిపేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల జీతాల బకాయిలు రూ.238 కోట్లు ఆర్థిక సహాయం త్వరలో రాబోతోంది. ఇంతవరకు 13వేల 90కోట్లు ప్రధాని విడుదల చేశారు. గత ప్రభుత్వం స్టీల్ సామర్థ్యానికి మించి వ్యయపరచి స్టీల్‌పాంట్‌ను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిందని వివరించారు. ఈ సారి పటిష్టమైన ప్లానింగ్‌తో విశాఖ ఉక్కును భారతదేశంలోని నంబర్ 1గా చేస్తామని వెల్లడించారు. ఈ అంశాలన్నీ అమలైతే విశాఖ ఉక్కుకు తిరుగే ఉండదు.

తెలుగు జాతి ఉన్నంత వరకు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం సజీవం.

మాఘమాస విశిష్టత

డా॥ దేవులపల్లి పద్మజ

తెలుగు సంవత్సర కాలపట్టికలో పదకొండవ నెల మాఘమాసం. మఖ నక్షత్రం వద్ద పౌర్ణమి చంద్రుడు ఉండటం చేత ఈ మాసం మాఘ మాసమనే పేరుతో వ్యవహారంలో ఉంది. ఈ మాసంలో నదీస్నానం చేసి, శ్రీమన్నారాయణుని పూజించి, శక్తికొలది దానం చేస్తే కోటి క్రతువులు చేసినంత ఫలితం కలుగుతుంది. మాఘ మాసంలో ముఖ్యమైన పండుగల్లో ప్రథమంగా వచ్చేది శ్రీపంచమి. ఈ రోజున మహాసరస్వతి ఆవిర్భావ దినోత్సవ వేడుక జరుపుకుంటాం.

మాఘమాసంలో వచ్చే రెండవ పండుగ "రథసప్తమి" ప్రత్యక్ష భగవానుడు శ్రీ సూర్యనారాయణమూర్తి ఆవిర్భావ దినోత్సవం. మాఘం అంటే యజ్ఞం. అఘం అనే పదానికి సంస్కృతంలో పాపం అని అర్థం. మాఘం అనగా పాపాలను

నశింపజేయునది. యజ్ఞ యాగాదులకు అనువైనది, మాధవ ప్రియకరమైన మాసమిది.

రోహిణీ నక్షత్రంలో, ఆదివారం, మాఘ శుద్ధ సప్తమి తిథిరోజున సూర్యనారాయణ మూర్తి జన్మించాడు. ఆయన తండ్రి కశ్యప ప్రజాపతి. సంజ్ఞ, ఛాయ ఈయన భార్యలు. యమధర్మరాజు, శనీశ్వరుడు ఈయన కొడుకులు. సూర్యుని నుండి వచ్చే కిరణాలు సప్త జ్ఞాన భూమికలు. అందులో జ్ఞానం ప్రధానమైనది.

రథసప్తమి, మాఘ మాసంలో వచ్చే ఆదివారాలలో సూర్యనారాయణ మూర్తికి ఆవుపాలతో పొంగలి చేసి, విశేష పూజా అర్చనలు చేసి అనంతరం పాలపొంగలి నైవేద్యం పెట్టి ఆ ఇంట్లో ఉన్న వారంతా ప్రసాదంగా స్వీకరించి ప్రత్యక్ష నారాయణుని అనుగ్రహం పొందవచ్చు. సూర్యనారాయణమూర్తి భూమి నుండి సుమారు 14.98 కోట్ల కిలోమీటర్ల ఎత్తులో ఉండి నేలపై ఉన్న మనలను సంరక్షిస్తూ ఉంటాడు. అదే భగవంతుని అనుగ్రహం. జీవకోటి మనుగడకు ఆధార భూతమైన శ్రీ సూర్యనారాయణుని మాసమంతా, ప్రత్యేకించి రథసప్తమి రోజున ఆరాధించి సర్వ శుభాలను పొందవచ్చు.

మూడవ పండుగ భీష్మ ఏకాదశి. మాఘ శుద్ధ ఏకాదశి. భీష్ముడు కైవల్యం చేరిన రోజు. విశేషించి విష్ణువు సేవకు, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ అత్యంత శుభ ఫలితాలను ఇస్తాయని చెబుతారు. ఆంధ్ర రాష్ట్రంలోని అంతర్వేది నరసింహస్వామికి భీష్మ ఏకాదశి రోజున విశేషమైన ఉత్సవాలు చేస్తారు. ఆ సందర్భంగా రథయాత్ర నిర్వహిస్తారు. విష్ణు సేవార్చనలతో ఈ ఏకాదశి రోజున స్వామిని పూజించి సత్ఫలితాలు పొందవచ్చు. ఇహ, పర సుఖాలనిచ్చే విష్ణువు ఆశీస్సులు పొందుదాం.

మాఘమాసంలో వచ్చే మరో పర్వదినం మహా శివరాత్రి. మాఘమాస బహుళ చతుర్థి తిథినాడు మహా శివరాత్రి పర్వదినం భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. బహుళ చతుర్దశి రోజు శివలింగోద్భవం జరిగింది. ప్రతీ నెలలోనూ బహుళ చతుర్థి తిథి సంభవిస్తుంది. ఆ రోజులలో మాస శివరాత్రి పర్వదినంగా జరుపుకుంటాం. పరమేశ్వరునికి చతుర్థి తిథి పూజలు అత్యంత ప్రీతికరం. ఈ పర్వదిన ప్రాశస్త్యాన్ని లింగపురాణం, పద్మపురాణం, స్కంధపురాణం వంటి ప్రముఖ పురాణాలలో విపులంగా వివరించారు. మహా శివరాత్రి పర్వదినం అర్ధరాత్రి సంభవించే లింగోద్భవ కాలం అజ్ఞాన, అంధకార నాశనానికి చిహ్నంగా చెబుతారు. శివ పార్వతులు కైలాసంలో ఆనంద తాండవం చేసే శుభ సమయాన అతి స్వల్ప ప్రయత్నంతో కోరిన అన్ని కోరికలు సిద్ధించి సుఖసంతోషాలు కలుగుతాయని నమ్మకం. శివరాత్రి జరిపే ప్రతీ పూజ, అభిషేకం, స్మరణ, దానం వంటివి మానవ కల్యాణానికి దోహదం చేస్తూ శివ తత్వంలో మమేకమై పోవటానికి దోహదం చేస్తుంది. సకల ఐశ్వర్య ప్రదాత పరమేశ్వరుడు. అయినప్పటికీ ఆయన నిర్వికారుడు, నిరాడంబరుడు, ఆదర్శవంతుడు. అటువంటి పరమేశ్వరుని లీలావిభూతులు అర్థం చేసుకోవటం అంత సులభతరం కాదు. జ్ఞాన మార్గానికి తద్వారా చేకూరే మోక్ష మార్గానికి అవరోధంగా నిలిచే అజ్ఞానం రాత్రికాలం నాటి అంధకారం. దాన్ని అధిగమించి శివతత్వాన్ని మనలో జాగృతం చేసే పరమోత్కృష్ట పర్వదినం మహా శివరాత్రి. దేవ దానవులు జరిపిన సముద్ర మథనంలో ఉద్భవించిన హాలాహలం తన కంఠంలో ధరించి లోకాలను కాపాడిన రోజుగా కూడా మహా శివరాత్రి ప్రసిద్ధి చెందింది. అంతే కాకుండా పార్వతిని పరిణయమాడిన రోజుగా మహా శివరాత్రిని భావిస్తారు. పరమేశ్వరునికి బిల్వదళాలు అత్యంత ప్రీతిపాత్రమైనవి. ఈ రోజు జరిపే బిల్వదళ పూజ అత్యంత ముఖ్యమైనది. అన్ని పరమేశ్వరాలయాలలో లోక కల్యాణార్థమై పార్వతీ పరమేశ్వర కల్యాణాలను వేడుకగా నిర్వహిస్తారు. దీనిని వీక్షించినట్లయితే అవివాహితులకు త్వరలోనే పరమేశ్వరుని వంటి ఆదర్శమూర్తి భర్తగా లభిస్తాడనీ, వివాహితల సంసారం ఆనందదాయకంగా సాగుతుందని నమ్మకం. మాఘ ఆదివారాలు ఎంతో ప్రశస్తమైనవి. ఈ మాసంలో శివాలయాల్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించినట్లే సకల శుభాలు కలుగుతాయని అంటారు.

మాఘ స్నానం

మాఘ మాసంలో తెల్లవారుఝామున నక్షత్రాలున్నప్పుడు స్నానం చేయడం ఉత్తమం. ఈ మాసంలో ప్రయాగ(త్రివేణీ సంగమం)లో స్నానం అతి ప్రశస్తం. కాశీలో స్నానం చేస్తే నూరు రెట్ల ఫలితం లభిస్తుందని అంటారు. వీలుకానివాళ్ళు ప్రతిరోజూ స్నానం చేసేప్పుడు ప్రయాగను గుర్తు చేసుకున్నా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని పెద్దల ఉవాచ. ఈ నెలలో నియమంగా ఏదైనా పారాయణం, జపం, అర్చన మొదలైనవి చేయడం వల్ల విశేష ఫలితాలు పొందవచ్చు.

సింగిల్ పేజీ కథ

మార్పు

సుస్మితా రమణమూర్తి

ఇంటి ముందు అరుగుపై కూర్చున్నాడు చక్రవర్తి, ఎదురింటి పిల్లలు మామిడి పండ్లు తింటుంటే తనకు నోరూరింది. ఇంట్లోకి వెళ్ళి భోజనాల బల్లపై ఉన్న మామిడిపండ్లు చూసాడు, తీసుకోబోయాడు.

"అవి పిల్లల కోసం ఉంచానండీ!" చాచిన చేయి విద్యుత్ తీగ తగిలినట్లు కోడలు మాటలకు వెనక్కి వచ్చేసింది.

"వాతావరణం చల్లబడింది. అలా పార్కుదాకా వెళ్ళి రండి. నడక ఆరోగ్యానికి మంచిది" కోడలు సలహాకు తలూపిన చక్రవర్తి దగ్గరలోని పార్కులోకి వెళ్ళి బెంచీపై కూర్చున్నాడు.

ఐసు ఫ్రూట్ల బండి వచ్చింది. మ్యాంగో పుల్ల ఐసు తీసుకుని చంటి పిల్లాడిలా ఆనందంగా చప్పరించ సాగాడు. "ఏమిటి చక్రవర్తీ! ఐసు పుల్ల చప్పరిస్తూ చిన్నప్పటి రోజులు గుర్తు చేసుకుంటున్నావా?"

ఆప్యాయంగా భుజం తట్టి అడిగిన బాల్య మిత్రుడు భద్రం వేపు నవ్వుతూ చూసాడు తను. "మామిడి పండ్లు తినాలనిపించింది. జేబులో పది రూపాయలే ఉన్నాయి. పది రోజులు ఆగితేనే పెన్షను వస్తుంది. మా వాడు అప్పుడే నా ఖర్చులకు ఇస్తాడు!"

భద్రం ఆశ్చర్యపోయాడు. "అంటే! నీ ఏటిఎమ్ కార్డు మీవాడికి..."

"ఇచ్చేసాను. ఆవిడ ఎలానూ లేదు. నా అవసరాలన్నీ వాడే చూస్తున్నాడు. ఇక కార్డుతో నాకేం పని?"

..అలాగని మామిడి పండ్లకి బదులు పుల్ల ఐసు అని మిత్రుని మాటలు అర్థం అయాయి చక్రవర్తికి. "ఉద్యోగం చేస్తున్న రోజుల్లో అందరూ నావారే అనుకున్నావు. అందరి కోసం సంపాదన అంతా ఖర్చు చేసిపావు ఇప్పుడైనా జాగ్రత్త పడరా!"

"మొదట్లో బాగానే ఉండేవాడురా! ఈమధ్యనే డబ్బులు అడుగుతుంటే విసుక్కుంటున్నాడు!"

"కాలానుగుణంగా మారాలి. వస్తున్న పెన్షనూ వదిలేస్తే రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుంది" మిత్రుని మాటలకు తలూపాడు చక్రవర్తి. తన బుర్రంతా ఏటిఎమ్ కార్డు ఆలోచనలతో నిండిపోయింది. స్నేహితుడు చెప్పిన మాటల గురించి చక్రవర్తి సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

"నీవు చెప్పింది నిజమేరా! "

మిత్రునికి మరింత బాగా అర్థం అయేలా హితబోధ చేసాడు భద్రం.

"పిల్లల కోసం కొన్నాను. ఈ మామిడి పండ్లు తినరా!" అంటూ చేతి సంచిలోంచి రెండు పండ్లు చక్రవర్తి చేతిలో పెట్టి, ఆప్యాయంగా భుజం తట్టి వెళ్ళిపోయాడు భద్రం.

మూడు రోజుల తర్వాత ఏటిఎమ్ కార్డు గురించి నిర్ణయం తీసుకున్నాడు చక్రవర్తి, "మమ్మీ! ఆకలి వేస్తోంది. మామిడి పండ్లు కోసి పెట్టు", "నాకు యాపిల్ ముక్కలు పెట్టు" ఇంటిలో పండ్లు లేనందున ఆమె ఇబ్బందిగా చూసింది పిల్లల వేపు. "ఆఫీసుకి వెళ్ళేటప్పుడు డాడీకి చెప్పాను. డాడీ పండ్లు తప్పకుండా తెస్తారు. తల్లి మాటలకు అయిష్టంగానే పిల్లలు తలలూపారు.

చక్రవర్తి అప్పుడే ఇంట్లోకి వచ్చాడు, సంచిని బల్లపై ఉంచుతూ చెప్పాడు.

"సంచిలో పండ్లున్నాయి. పిల్లలకు పెట్టమ్మా!"

పిల్లలు ఆనందంతో గంతులు వేసారు. "మా తాత మంచి తాత!" అంటూ కౌగిలించుకున్నారు.

చక్రవర్తి పొంగిపోయాడు. "మామిడి పండ్లు, యాపిల్సు, అరటి పండ్లు మాంవయ్య గారు ఎలా తేగలిగారు!? ఉదయం డబ్బులు ఇచ్చారేమోనని స్వగతంలో అనుకుంటూ పిల్లలకు వాటిని కోసి పెట్టింది ఆమె. పిల్లలు ఆనందంగా తింటుంటే చక్రవర్తి మనసు సంతోషంతో నిండి పోయింది. "డాడీ వచ్చారు" పిల్లలు తింటూనే అరిచారు.

పండ్లున్న బల్ల వేపు, పిల్లలు తింటున్న పండ్ల వేపు ఆశ్చర్యంగా చూసాడు తను.

"డాడీ, ఏటిఎమ్ కార్డు హడావుడిలో, ఆఫీసుకి వెళ్ళేముందు నీవు చెప్పిన పండ్ల సంగతే మరచిపోయాను. కార్డు ఎక్కడ పెట్టానో గుర్తు రావటం లేదు. డాడీకి డబ్బులు తేలేకపోయాను"

"నా కార్డు, మీకార్డు ఎప్పుడూ మీ పర్సులోనే ఉంటాయి కదా?"

"అవును కదూ!?...ఆ విషయమే గుర్తు లేదు నాకు ఓసారి నిన్న వేసుకున్న నా బట్టల్లో చూడు".

"వెతకనవసరం లేదురా! ఉదయం పనిమనిషి ఇల్లు తుడుస్తున్నప్పుడు సోఫా కింద ఉందట కార్డు. నాకు ఇచ్చింది. నీకు చెప్పడం మరచిపోయాను".

"హమ్మయ్య! ఉంది కదా! నాకు ఇవ్వండి కార్డు. బీరువాలో భద్రపరుస్తాను"

"మా తరం కరెన్సీ రెపరెపలది! దాంతో సంబంధమే లేదు మీకు. మీ తరం గూగుల్ ప్లే, ఫోన్ పే. అమెజాన్ పేలది" కోడలు, కొడుకు ఆశ్చర్యంగా చక్రవర్తి మాటలు వినసాగారు.

"నేను అడిగినప్పుడు నీదగ్గర నోట్లు లేకపోవడం, నీవు బాధ పడడం, నేను ఇబ్బంది పడడం లాంటివి ఇకపై ఉండనే ఉండవురా!"

చక్రవర్తి మాటలు అర్థం కాక ఇద్దరూ ఇంకా ఆశ్చర్యపోతూనే ఉన్నారు.

"ఎప్పుడూ ఎవరూ ఒకేలా ఉండిపోరు. మార్పు అనేది సహజం. ఈ మార్పు ఒక విధంగా మంచిదే! ఉభయతారకం కూడా! నా కోసం ప్రత్యేకించి నీవు ఏటిఎమ్ దాకా వెళ్ళనవసరం లేదిక. అవసరమైతే నేనే వెళ్తుంటాను. ఆ మాత్రం నడవడం మంచిదే కదా?... ఆరోగ్య దాయకం కూడాను!"

"డాడీ! మీ కార్డు..."

"ఎవరి కార్డు వారి దగ్గరే ఉండటం పద్ధతి కదరా?"

చక్రవర్తిలో ఊహించని మార్పుకి కొడుకు నిర్ఘాంతపోయాడు. కోడలు ఆశ్చర్యపోయింది. ■

చినుకుల వాన

బహుశా
ఇది ఏ మేఘం
మీటిన రాగమో!
సమ్మోహనంలా
ఒకటే చినుకుల దరువు.

ధరణి మాత్రం
ఎన్నాళ్ల దుఃఖాన్ని
దాచుకొంటుందనీ
చినుకు స్పర్శకు చిందేస్తూ
సోయగాల్ని ఆరబోస్తూ
జలపాత లయల్ని
విరజిల్లుతోంది.
చూసి తరించే కళ్లకు
ఉషోదయమై
 ఊరిస్తూ
ఆబాల గోపాలాన్ని
అలరిస్తోంది.
ప్రతి చినుకు ఒక అక్షరంలా మారి
పదాల కవిత్వమై పొంగి
పొర్లుతోంది.
చినుకులపూల వాన చిందేస్తూ
రేపటి కలల్ని ఆహ్వానిస్తూ
అలరిస్తోంది.

– చిల్లెం మహబూబ్ బాషా

అరిషడ్వర్గాలు

జీవిత చరమాంకంలో
దక్కని సంతృప్తి
మనఃక్షోభకు దారి తీస్తుంది
అసంతృప్తితో రగిలి
అరిషడ్వర్గాల వలలో చిక్కుకుని
సతమతమయితే
అవే చింతకు దిక్సూచిగా మారతాయి
అహం ఉంటే ఇహంలో శాంతి ఉండదు
కామాన్ని అదుపులో పెట్టుకుంటే
క్రోధాన్ని శత్రువుగా భావిస్తే
లోభ ప్రవృత్తిని వీడితే
మోహ వాంఛను దరి చేరనీకుంటే
మదమెక్కి చిందులేయకుంటే
మాత్సర్యం వీడి ఆనందాన్ని పొందితే
అప్పుడే మానవత వికసిస్తుంది
శాంతి కపోతాలు వినువీధిలో
షికారు చేస్తాయి
మనిషి మనీషిగా పరావర్తనం
చెందుతాడు
సర్వజన సంక్షేమం
సంక్షోభాలను రూపు మాపుతుంది
జన్మకు పరమార్థం
మృగంలా మారడం కాదు
వికాసం విలసిల్లితే అంతటా క్షేమమే!
సంక్షోభ నివారణే!!

– పంతంగి శ్రీనివాస రావు

నీ రూపపు కవనమే..!

నా వైపు వీస్తున్న నీ
తొలిచూపు పవనాల
పరిమళాలు నా హృదయ
గదిలో జ్ఞాపకాల
ప్రకంపనాల్ని సృష్టిస్తున్నాయి.
నా వైపు కురుస్తున్న నీ చిరునవ్వుల
చిరుజల్లుల నవరాగాలు నా మది వీధిలో
స్వప్నాల సరిగమల్ని ముద్దాడుతున్నాయి.
నా వైపు
దూసుకొస్తున్న నీ
తియ్యని
మాటల సెలయేటి
గలగలలు
నా ఆలోచనల
సంద్రంలో ఆత్మీయత
ప్రతిబింబాల్ని
ఏర్పరుస్తున్నాయి.
నీ రూపపు కవనమే నా జీవితం
నీ ప్రేమ కిరణమే నా జీవనం.
నీ గుండె గుండెలో నా జీవనం.
నువ్వు లేని నా గుండె నా మరణం.

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

ఈ వారం కవిత్వం

అలికిడి ఆశ కోసం

కరుగుతున్న కాలం
చప్పుడును వింటున్న కళ్లు
రాత్రి రహదారులపై భయాన్ని మోస్తూ.

నిద్ర అంచులపై
లెక్కించే అడుగుల్లో
కనిపించని దూరపు జవాబుకై

దిక్కును తప్పు పట్టలేక
దారి కరువుకు పైకి చెప్పుకోలేక
అలసిన పాదాల మధ్య.

ముడుచుకు పడుకుని
అలికిడి ఆశ కోసం
కళ్లలో కలివిడి ఒత్తులేసుకుని
చూస్తున్నాయి.

– చందలూరి నారాయణరావు

ఎదగాలేమో..!?

నేను... ఎదగాలేమో!?.
పట్టుబట్టలే కావాలని
పేచీలు పెట్టే నేను,
నాన్న పంచెకు
ఎన్ని చిరుగులున్నాయో!
ఎప్పుడైనా లెక్కించింది లేదు.

పుట గడవడమే కష్టం
అనుకునే ఇంట్లో
రోజు చాలీచాలని
అన్నం కూరల్తో ఎలా?..
అని నిందిస్తున్న నేను
ఎన్ని దినాలను పస్తులతో
అమ్మ గడిపిందో
తెలుసుకోలేదు ఎన్నడూ.
జులాయిగా తిరిగే
నాకు
నాన్న కాళ్లకు
చెప్పులే లేవనేది
గుర్తుకు రాలేదు.. ఎందుకనో!.
ఇవి అర్థం కావాలంటే
నేను నాన్నగా ఎదగాలి.

– రాము కోలా

సాయంత్రం పూట అలా బయట కెళ్లినప్పుడు.. చాట్‌బండార్‌ని చూస్తే అప్రయత్నంగానే మన కాళ్లు బ్రేకులు వేసినట్టుగా ఆగిపోతాయి. భయ్యా ఏక్ ఆలూ చాట్ అనకుండా నోరు కట్టుకోవడం కష్టమే. చాట్ చేసే కిటుకు తెలిస్తే ఒక్క ఆలూచాట్ ఏంటి.. మటర్ చాట్, కార్న్‌చాట్ ఇలా.. బోలెడు రకాల్ని అక్కడికంటే రుచిగా, శుచిగా ఇంట్లోనే చేసుకోవచ్చు. అందుకే వీటిపై ఓ లుక్కేసేయండి.

విందు-పసందు

పోషకాల చాట్స్

ఫ్రూట్ చాట్.

కావాల్సినవి : అరటి పండు1, యాపిల్-1, పియర్-1, కమలా పండు-1, స్ట్రాబెర్రీలు-నాలుగు, మిరియాల పొడి-పావుచెంచా, చాట్ మసాలా- అర చెంచా, ఉప్పు తగినంత, జీలకర్ర పొడి- పావుచెంచా, పుదీనా ఆకులు-ఐదు, నిమ్మరసం-చెంచా,

తయారీ : ముందుగా పండ్లని కావాల్సిన సైజులో ముక్కలుగా చేసుకోవాలి. వీటికి మిరియాల పొడి, చాట్‌మసాలా, ఉప్పు, జీలకర్ర పొడి, చిన్నగా తురుమిన పుదీనా ఆకులని చేర్చుకోవాలి. కలిపేటప్పుడు పండ్ల ముక్కలని మెత్తగా చేసేయొద్దు. ఆ తర్వాత నిమ్మరసం కలిపితే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.

బఠానీలతో..

కావాల్సినవి : బఠానీలు- కప్పు, నీళ్లు- కప్పున్నర, దాల్చినచెక్క- చిన్నముక్క, బిర్యానీ ఆకు-1, అల్లం తురుము-చెంచా, ఇంగువ-చిటికెడు, ఉప్పు- తగినంత, పసుపు- పావు చెంచా, కారం- చెంచా, గరం మసాలా- చెంచా, జీలకర్ర పొడి- అరచెంచా, ఆమ్‌చూర్- అరచెంచా, ఉల్లిపాయ ముక్కలు- మూడు చెంచాలు, టమాటో ముక్కలు-రెండు చెంచాలు, పచ్చిమిర్చి-2 (సన్నగా తరిగి పెట్టుకోవాలి),కొత్తిమీర తురుము-రెండు చెంచాలు, సన్న కారప్పూస-రెండు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు, చాట్‌మసాలా-చెంచా.

తయారీ : బఠానీలు రాత్రే నానబెట్టుకోవాలి. కుక్కర్‌లో తగినన్ని నీళ్లు పోసుకుని బఠానీలు, బిర్యానీ ఆకు, ఇంగువ, అల్లం తురుము వేసి సన్నమంటపైన నాలుగు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. కుక్కర్ మూత తెరుచుకున్నాక పసుపు, కారం, గరంమసాలా, జీలకర్రపొడి, ఆమ్‌చూర్ వేసి బాగా కలిపి నీళ్లు ఇనికేంతవరకూ ఉడికించుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని పైన నిమ్మరసం, ఉల్లిపాయ ముక్కలు టమాటో ముక్కలు, కొత్తిమీర తురుము, కారప్పూస, చాట్‌మసాలా, పచ్చిమిర్చి ముక్కలు వేసుకుంటే చాట్ సిద్ధం.

మొక్కజొన్న గింజలతో..

కావాల్సినవి : స్వీట్ కార్న్-ఒకటిన్నర కప్పు, ఉల్లిపాయ ముక్కలు-రెండు చెంచాలు, సన్నగా తరిగిన టమాటో ముక్కలు-నాలుగు చెంచాలు, పచ్చిమిర్చి-1, కొత్తిమీర తురుము- రెండు చెంచాలు, చాట్‌మసాలా-అరచెంచా, జీలకర్రపొడి-పావు చెంచా, కారం- పావుచెంచా, నిమ్మరసం-చెంచా, ఉప్పు-పావు చెంచా, నూనె-చెంచా, సన్నకారప్పూస-నాలుగు చెంచాలు, దానిమ్మ గింజలు-రెండు చెంచాలు. **తయారీ :** స్వీట్‌కార్న్ గింజల్ని కుక్కర్‌లో ఉడికించుకోవాలి. లేదా కడాయిలో కాసింత బటర్ వేసి మెత్తగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఒక గిన్నెలోకి తీసుకుని వేడిగా ఉండగానే కారం, చాట్‌మసాలా, జీరాపొడి వేసి కలపాలి. చల్లారాక ఉల్లిపాయ, టమాటో ముక్కలు పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము, నిమ్మరసం వేసి కలపాలి. చివరగా కారప్పూస, వేయించిన పల్లీలు, దానిమ్మ గింజలు చల్లుకొంటే చాట్ రెడీ.

కాశీ చాట్..

కావాల్సినవి : నూనె- చెంచా, ఉల్లిపాయ-1, ఆలుగడ్డలు-రెండు, టమాటోలు-నాలుగు, అల్లం- చిన్నముక్క, పచ్చిమిర్చి-ఒకటి, పావ్‌బాజీ మసాలా-రెండు చెంచాలు, గరంమసాలా-చెంచా, జీలకర్ర పొడి-చెంచా, కారం- చెంచా, చాట్‌మసాలా -చెంచా, నల్ల ఉప్పు-అరచెంచా, ఉప్పు- తగినంత, నిమ్మరసం-చెంచా, నమక్‌పారా- అరకప్పు, సన్నకారప్పూస- అరకప్పు, కొత్తిమీర తురుము- పావుకప్పు.

తయారీ : బంగాళాదుంపల్ని కుక్కర్‌లో ఉడికించి, నీళ్లు వార్చుకుని మెత్తగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. పొయ్యిమీద కడాయి పెట్టి.. నూనెపోసి వేడెక్కాక అందులో పచ్చిమిర్చి, ఉల్లిపాయముక్కల్ని దోరగా వేయించుకోవాలి. దీనిలో టమాటో ముక్కలు కూడా వేసి బాగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత ఉడికించిన బంగాళాదుంప ముక్కలు కూడా వేసి మెత్తగా మెదుపుకోవాలి. దీనిలో పావ్‌బాజీ మసాలా, గరంమసాలా, జీలకర్రపొడి, కారం, చాట్‌మసాలా, ఉప్పు వేసి రెండు నిమిషాలు ఉడకనివ్వాలి. ఒక పాత్రలోకి తీసుకొని నిమ్మరసం వేసుకుని నమక్‌పారా, కారప్పూస, కొత్తిమీరతో అలంకరించుకోవాలి. పూరీ, టిక్కా, పావ్‌బాజీ బన్నుతో తింటే రుచి బహ్మాండంగా ఉంటుంది.

అవగాహన అవసరం

సిహెచ్‌వివి రఘుబాబు

ప్రపంచ కేన్సర్ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న జరుగుతుంది. కేన్సర్ గురించి అవగాహన పెంచడం, దాని నివారణ, గుర్తింపు, చికిత్సను ప్రోత్సహించడం ఈ దినోత్సవం లక్ష్యం. 2000లో ప్యారిస్‌లోని న్యూ మిలీనియం కొరకు కేన్సర్‌కు వ్యతిరేకంగా ప్రపంచ శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ కేన్సర్ దినోత్సవం ప్రారంభమైంది. ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా కేన్సర్ భారాన్ని తగ్గించడానికి ప్రపంచం ఏకం చేసే ప్రయత్నం జరుగుతుంది. జెనీవాలో, యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్ 1993లో స్థాపించబడింది. ఇది ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ నిర్మూలనకు, వైద్య పరిశోధనలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న సభ్యత్వ ఆధారిత సంఘం. అనేక ప్రసిద్ధ సంస్థలు, కేన్సర్ సంఘాలు, చికిత్సా కేంద్రాలు కూడా ఈ ప్రయత్నానికి మద్దతు ఇచ్చాయి.

భారత్‌లో పెరుగుతున్న మహమ్మారి...

భారతదేశంలో 2020 సంవత్సరంలో 13.92 లక్షల మంది ప్రజలు కేన్సర్ బారిన పడగా, 2021లో 14.26 లక్షల మంది, 2022లో 14.61 లక్షల మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. ముఖ్యంగా కేన్సర్లలో హెడ్ అండ్ నెక్ కేన్సర్లే 26 శాతం ఉన్నాయని, దేశంలో తల, మెడ కేన్సర్లు పెరుగుతున్నాయని ఓ అధ్యయనం తెలియజేసింది. ప్రపంచ హెడ్ అండ్ నెక్ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఇటీవల దేశవ్యాప్తంగా 1,869 మంది కేన్సర్ రోగులపై నిర్వహించిన అధ్యయనంలో ఈ ఫలితాలు వెల్లడయ్యాయి.

భారత్‌లో పెరిగిన పొగాకు వినియోగం, హ్యూమన్ పాపిల్లో మావైరస్ (హెచ్‌పివి) ఇన్ఫెక్షన్ కారణంగా హెడ్ అండ్ నెక్



కేన్సర్లు పెరుగుతున్నాయని, ముఖ్యంగా యువకుల్లో కేన్సర్లు రావడం ఆందోళన కలిగిస్తోంది.

భారతదేశంలో దాదాపుగా మూడింట రెండు వంతుల కేన్సర్ కేసులకు స్క్రీనింగ్ తక్కువగా ఉండటంతో ఆలస్యంగా గుర్తింస్తున్నట్లు వైద్యులు చెప్పారు. ఫస్ట్/సెకండ్ స్టేజ్‌లో కేన్సర్‌ను గుర్తిస్తే 80 శాతం కన్నా ఎక్కువ మందిలో హెడ్ అండ్ నెక్ కేన్సర్లు నయమవుతాయి. ఈ కేన్సర్ల తర్వాత తర్వాతి ప్లేస్‌లో జీర్ణాశయ కేన్సర్లు 16 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. రొమ్ము, రక్త క్యాన్సర్లు 9 శాతం ఉన్నాయి. ఇటీవలి గ్లోబో కాన్ నివేదిక ప్రకారం, 2040 నాటికి భారతదేశంలో 2.1 మిలియన్ల కొత్త కేన్సర్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంది, ఇది 2020లో సంఖ్య కంటే పెద్ద పెరుగుదల.

తెలంగాణలో 53 వేల కేన్సర్ వ్యాధిగ్రస్తులు

తెలంగాణలో 2025 నాటికి 53,000 మంది కేన్సర్ వ్యాధిగ్రస్తులు ఉంటారని తాజా నివేదికలో వెల్లడైంది. ప్రొఫైల్ ఆఫ్ కేన్సర్ అండ్ రిలేటెడ్ ఫ్యాక్టర్స్, తెలంగాణ-2021 నివేదిక ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 24,857 మంది పురుషులు, 28,708 మంది మహిళలు కేన్సర్ రోగులు ఉంటారని అంచనా వేస్తున్నట్లు నివేదికలో పేర్కొంది. బెంగళూరులోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్) పిబిసిఆర్లు, హెచ్బిసిఆర్ల (హాస్పిటల్ ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు) నెట్వర్కును ఉపయోగించి సేకరించిన గణాంకాల ప్రకారం, తెలంగాణలో ప్రతి సంవత్సరం సగటున 3,865 కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్నాయి. పురుషులు, మహిళలు ఇద్దరికీ, నోరు, రొమ్ము కేన్సర్కు అత్యంత సాధారణ సైట్లు. తొమ్మిది మంది పురుషులలో ఒకరు; ఏడుగురిలో ఒక మహిళకు ఏ ప్రదేశంలోనైనా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలలో, ప్రతి మిలియన్ పిల్లలకు 55 మంది పురుషులు, 39 మంది ఆడ పిల్లలు కేన్సర్ బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రాణాంతకమే! అయినా..

ప్రస్తుత కాలంలో ప్రజల్ని భయపెడుతున్న భయంకరమైన వ్యాధి కేన్సర్. ఇది ప్రాణాంతకమే. కానీ ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకోవడం వల్ల ప్రాణాలతో బయట పడవచ్చు. కేన్సర్ పేరు వింటేనే వెన్నులో వణుకు పుడుతుంది. ఈ వ్యాధిని గుర్తించిన మొదలు, చికిత్స పూర్తయ్యేంత వరకూ నరక యాతన అనుభవించాలి. ట్రీట్మెంట్ తర్వాత కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాలి. తిరిగి ఆరోగ్యవంతులు అవుతారనేది నమ్మకం లేదు. ఒకవేళ ఆరోగ్యవంతులు అయ్యే అవకాశాలు ఉన్నా అందుకు ఎంత సమయం పడతుందో చెప్పలేం. సైలెంట్ కిల్లర్‌గా పిలిచే జబ్బుల జాబితాలో కేన్సర్ ప్రధానమైనది. పరిస్థితి చెయ్యి దాటిపోయే వరకు కేన్సర్ చాలా వరకు బయటపడదు. అయితే కేన్సర్ వస్తున్న కారణాలలో చాలావరకు మనుషుల అలవాట్లు, ఆహారమే ప్రధానంగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

చెప్పాలంటే 30 నుండి 50 శాతం మందికి కేన్సర్ కేవలం అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా వస్తోంది. కేన్సర్ అనేది మనిషి శరీరంలోని కొన్ని కణాలు నియంత్రణ లేకుండా పెరిగి శరీరంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించే పరిస్థితి ఉంటుంది. కేన్సర్‌తో మరణించేవారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది. బాలీవుడ్ నటి పూనమ్ పాండే కూడా కేన్సర్‌తోనే మరణించారు. కేవలం 32 ఏండ్ల వయసులోనే ఆమె చనిపోవడం అందరినీ ఆశ్చర్యానికి లోను చేసింది. చిన్న పిల్లల నుండి, వయోవృద్ధుల వరకూ, సాధారణ జనాల నుంచి సెలబ్రిటీల వరకూ ఎంతో మంది కేన్సర్ బారిన పడి అర్థాంతరంగా చనిపోతున్నారు. అయినప్పటికీ రోగ నిర్ధారణ, చికిత్స సహాయంతో దీన్ని తగ్గించుకోవచ్చు.

క్రికెటర్ యువరాజ్ సింగ్, హీరోయిన్లు మనీషా కోయిరాలా, సోనాలి బింద్రే తదితరులు కేన్సర్‌తో పోరాడి గెలిచారు. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత గుర్తిస్తే ఏమాత్రం ప్రయోజనం ఉండదు. క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టాలి.

లక్షణాలు

ఈ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం తగ్గుతుంది. కారణం లేకుండా ఆకలి తగ్గిపోతే ఒకసారి వైద్యుల్ని సంప్రదించి పరీక్షలు చేయించాలి. తల నుంచి కాలి వరకు ఎన్నో ప్రాంతాల్లో కేన్సర్ వచ్చే అవకాశముంది. ఇందులో దాదాపు వందకు పైగా రకాలున్నాయి. ఉదా॥ ఊపిరితిత్తుల కేన్సర్ అయితే దగ్గు, ఆయాసం ఉంటుంది. ఉదర కేన్సర్ అయితే ఆకలి తగ్గిపోవడం, వాంతులు వచ్చే ఫీలింగ్ ఉంటుంది.. దీనిని స్క్రీనింగ్ ద్వారా గుర్తించొచ్చు. అలాగే కొన్ని లక్షణాలతో కూడా దీన్ని గుర్తుపట్టొచ్చు. శరీరంలోని ఏ భాగంలోనైనా కణితులు వచ్చినట్టు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకండి. నొప్పి ఉన్న, నొప్పి లేని కణితులు కూడా కేన్సర్‌కు కారణమవుతాయి. ఇక కొన్ని కణితులు అయితే వేగంగా పెరుగుతాయి. కేన్సర్ వల్ల వచ్చే కణితులు శరీరంలోని ఏ భాగంలోనైనా ఏర్పడవచ్చు. ఎలాంటి ప్రయత్నం చేయకుండా గుర్తించదగిన మొత్తంలో మీరు బరువు తగ్గినట్లయితే అనుమానించాల్సిందే.

చికిత్స

కేన్సర్‌కు ప్రాథమికంగా రెండు రకాలుగా చేస్తారు. వ్యాధిని అదుపు చేయడానికి శస్త్రచికిత్సను చేస్తారు. సర్జరీ ద్వారా కేన్సర్ కణాల అసాధారణ పెరుగుదల/కణాల గడ్డను తొలగించడం జరుగుతుంది, తర్వాత తొలగించిన భాగం జీవాణు పరీక్ష ఉంటుంది. ఇది ప్రత్యేకంగా కణితి పరిణామం బట్టి చేస్తారు. ఇక సర్జరీ లేకుండా కేన్సర్‌కు కీమోథెరపీ ద్వారా చికిత్సనందిస్తారు. దీనిలో ప్రాథమికంగా అసాధారణంగా పెరుగుతున్న కణాలను నాశనం చేయడానికి మందులను ఇస్తారు. మరొక చికిత్సా విధానం రేడియోథెరపీ, దీనిలో పెరుగుతున్న కణితి మీదకు గామా కిరణాలు వంటి రేడియేషన్లను ప్రసరింపచేస్తారు. కొన్నిసార్లు, పేషేంట్స్ పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స, శస్త్రచికిత్స కాని రెండు పద్దతులను ఉపయోగిస్తారు. ఇతర భాగాలకు కేన్సర్ కణాల వ్యాప్తిని నివారించడానికి కీమోథెరపీ లేదా రేడియోథెరపీని మళ్ళీ ఆ ప్రాంతంలో నిర్వహిస్తారు. నిజానికి శరీరంలో ఏ భాగానికి కేన్సర్ సోకినా చికిత్స వ్యయంతోను, శారీరక, మానసిక శ్రమతోనూ కూడుకున్నదిగా ఉంటుంది. సన్నిహితులు ధైర్యం నూరిపోసి, వెన్నంటి ఉంటే చికిత్స సులువవుతుంది. చాలా వ్యాధుల్లా కేన్సర్ అంటువ్యాధి కాదు, కానీ ప్రాణాపాయాన్ని కలిగించే వ్యాధి. కేన్సర్ ఉందనగానే భయపడడం సహజమే. అయినా అది పరిష్కారం కాదు. వ్యాధి లక్షణాలు, తీవ్రత, చికిత్సపై సరైన అవగాహన చేసుకుని ధైర్యంగా ముందుకు వెళితే జీవితకాలం పెంచుకోవచ్చు.



వ్యాధి రాకూడదంటే.. కేన్సర్ రాకూడదంటే జీవనశైలిలో ఈ ఐదే మార్పులు తప్పనిసరిగా చేయించుకోవాలని అంటున్నారు.

ఆహారం.. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కేన్సర్ రాకుండా కాపాడతాయి. ఆహారంలో మూడింట రెండు వంతులు శాకాహారం ఉండాలి. ఆహారంలో ఎన్ని రకాల కూరగాయలు, పండ్లు ఉంటే ఆరోగ్యం అంత బాగుంటుంది. ఫైటో కెమికల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పు, కారం, బేకింగ్ ఆహారాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి.

ఒత్తిడి.. ఇప్పుడు చాలామంది ఒత్తిడి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఒత్తిడి తీసుకునే ఆహారం మీద ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడిగా ఉన్నప్పుడు అధికంగా తినడం, ప్రాసెస్ చేసిన ఆహారాలు తినాలని అనిపించడం, స్వీట్లు, ఉప్పు, కారం ఎక్కువ తినడం జరుగుతుంది. అదే విధంగా ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆరోగ్య కరమైన జీవనశైలి సాధ్యం కాదు. ఇది కేన్సర్‌కు కారణమయ్యే అంశం.

నిద్ర.. మంచి నిద్ర ఆరోగ్యానికి శ్రీరామ రక్ష. నాణ్యమైన నిద్ర శరీరంలో కొత్త కణాల ఉత్పత్తికి సహాయ పడుతుంది. సహజంగా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. గుండె జబ్బులు, మధుమేహం, కేన్సర్, డిప్రెషన్ వంటి సమస్యలు జయించాలంటే 7 గంటల నిద్ర తప్పనిసరి. నిద్ర గడియారం పనితీరు దెబ్బతింటే రొమ్ము, పెద్ద పేగు, ప్రొస్టేట్, అండాశయ కేన్సర్‌లు తొందరగా వస్తాయి.

శారీరక శ్రమ.. ప్రతిరోజూ అరగంట పాటూ క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి తగ్గడానికి, శరీరంలో హార్మోన్ల ఉత్పత్తి ఆరోగ్యంగా ఉండటానికి, మెదడు పనితీరుకు సహకరించే ఎండార్ఫిన్ల విడుదలకు అనువుగా ఉంటుంది. పాజిటివ్‌గా ఆలోచించడానికి, ఉల్లాసంగా ఉండటానికి ఇది తోడ్పడుతుంది.

మద్యపానం,ధూమపానం.. ధూమపానం వ్యసనంగా మారి కేన్సర్ బారిన పడేలా చేస్తాయి. ఆహారం నుండి నిద్ర, ఒత్తిడి, శారీరక శ్రమ వంటి ఎన్నో విషయాలను కేవలం ధూమపానం, మద్యపానం ప్రభావితం చేస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండటం మంచిది. కేన్సర్ రాకుండా ఉండాలంటే మేలైన జీవనశైలి ముఖ్యం. ఆ విషయాన్ని చాటడానికే ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన పెంచుకుంటే మన ఆరోగ్యంతో పాటు ఇతరులనూ రక్షించినవాళ్లం అవుతాం.

కథ

పువ్వులు-ముళ్లు

సింహగిరి ఆశ్రమంలో చిదానందుడు విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు మంచి నడవడిక కూడా నేర్పించేవాడు. ఒక్కోసారి అవసరమైతే ప్రయోగాత్మకంగా కూడా చేసి చూపించేవాడు. దానితో విద్యార్థులకు విషయం మీద పట్టు దొరికేది.

చిదానందుడి శిష్యులలో చలపతి, రఘుపతి అనే విద్యార్థులు కూడా ఉండేవారు.

చలపతికి ఈర్ష్య, అసూయ, ద్వేషం, వంటి గుణాలు మెండుగా ఉండేవి. ఎప్పుడూ ఎవరో ఒకరి మీద ఫిర్యాదు చేస్తూ ఉండేవాడు. రఘుపతి శాంత స్వభావుడు. ఎవరి గురించి ఎన్నడూ ఒక్క పరుషవాక్యం కూడా మాట్లాడేవాడు కాదు.

ఇద్దరికీ అన్ని విషయాల్లోనూ గుణాలు వ్యతిరేకంగా ఉండేవి.

చిదానందుడు చలపతిని ఎన్నోసార్లు ప్రవర్తన మార్చుకోమని చెప్పినా వినేవాడు కాదు. సరైన సమయంలో చలపతికి కనువిప్పు కలిగించాలని నిర్ణయించుకున్నాడు చిదానందుడు.

ఒకరోజు విద్యాబోధన అనంతరం విద్యార్థులను సమీపంలో ఉన్న అడవికి తీసుకెళ్లాడు. రహదారిలో అడ్డంగా ఒక ముళ్లచెట్టు, పువ్వులచెట్టు ఉన్నాయి.

చిదానందుడు శిష్యులతో-

"ఈ ముళ్ల చెట్టును దారికి అడ్డం లేకుండా నరికి పారేయండి, కానీ పువ్వుల చెట్ల జోలికి మాత్రం వెళ్లకండి" అని చెప్పాడు.

శిష్యులతో పాటు చలపతి, రఘుపతి కూడా ఆ పనిలో పాల్గొన్నారు.

చలపతి గురువుగారితో "గురువుగారూ! రెండూ చెట్లే కదా! రెండూ దారికి అడ్డంగా ఉన్నాయి కదా, అలాంటప్పుడు ఒక్కదాన్నే నరికేయడం ఏం న్యాయం?" అని ప్రశ్నించాడు.

దానికి చిదానందుడు చిరునవ్వు నవ్వి-

"నిజమే నాయనా! రెండూ చెట్లే.... కానీ ఇది ఎందుకూ పనికి రాని ముళ్ల చెట్టు. అదీకాకుండా వచ్చీ, పోయే వారిని తన ముళ్లతో గాయం చేయడమే దాని పని. అయితే పువ్వుల చెట్టు అలా కాదు. సువాసన భరితమైన పువ్వులనిస్తుంది. ఆ పూలు దేవుని పూజకు ఉపయోగపడి తన జన్మ సార్థకం చేసుకుంటుంది. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి.

మనుషులు కూడా అంతే. తమను హింసించే వారిని దూరంగా ఉంచుతారు. పది మందికి పనికి వచ్చే వాడిని అభిమానిస్తారు. ఈ పువ్వుల చెట్టు మన రఘుపతి ఐతే ఈ ముళ్లచెట్టు ఎవరో నేను చెప్పక్కర్లేదు కదా?!" అన్నారు నర్మగర్భంగా.

గురువుగారు తనను ఉద్దేశించే ఈ విషయం చెప్పారని గ్రహించిన చలపతి ఆ రోజు నుండి తన ప్రవర్తన మార్చుకున్నాడు.

శిష్యుడిలో వచ్చిన పరివర్తన చూసిన చిదానందుడు ఎంతో సంతోషించాడు.

- లోగిశ లక్ష్మీనాయుడు, సింహాచలం

వార్త ఆదివారం

బాలగేయం

నాగలి పట్టిన రైతును

ఆకలి తీర్చే
అన్నదాతను
నిరంతర శ్రమ జీవిని.
నేను స్వార్థం లేని
కృషీవలుడను
వేకువజామున లేస్తాను
పొలం పనులన్నీ
చూస్తాను
చక్కని పంటలు
పండిస్తాను
చేనూ చెలకలే నా
చిరునామా.
పాడి పశువులే
నా ధీమా.
ఆరుగాలం
శ్రమపడతాను
అందరి ఆకలి
తీరుస్తాను
ఆకలన్నదే ఎరుగను
నేను అన్నం కోసం
పరితపించను
హాయిగ నేలపై
నిదురిస్తాను
పచ్చని ప్రకృతే
ఆస్తిపాస్తులు
పంటపొలాలే
సిరిసంపదలు
నాగలి పట్టిన రైతును
నేను ఆకలి తీర్చే
అన్నదాతను.

– నాగరాజు కామర్సు

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎస్.వసంత్, నాగోల్

ప్రశ్న: జెయింట్ వీల్ రూపకల్పన ఎప్పుడు జరిగింది?

జవాబు: మొదటిసారిగా 1893లో చికాగోలో జెయింట్ వీల్‌ను నిర్మించారు. దీనిని జార్జి ఫెర్రిస్ అనే వ్యక్తి నిర్మించినందు వల్ల దానిని ఫెర్రిస్ వీల్ అని పిలిచేవారు. అప్పట్లోనే ఇది 250 అడుగుల వ్యాసంతో ఉండేది. దానికి ఉండే 36 గదుల ద్వారా 2,160 మంది ఒకేసారి తిరగగలిగేవారు.

దీని తర్వాతదాని గురించి చెప్పుకోవాలంటే జపాన్‌లోని యొకహామా నగరంలోని చక్రం గురించి చెప్పుకోవాలి. 344 అడుగుల ఎత్తున వుండే దీనిలో ఒక పెద్ద గడియారాన్ని కూడా ఇమిడ్చారు. దానిలో 480 మంది కూర్చుని తిరగవచ్చు.

-ఎస్.పుష్ప, విజయవాడ

ప్రశ్న: ఎవరెస్ట్ పర్వతం మీద పడిన వర్షం ఏమవుతుంది?

జవాబు: వర్షం కురిసినా, విపరీత స్థాయిలో మంచు కురిసినా హిమనీ నదాలు ఏర్పడతాయి. వీటిని గ్లాసియర్స్ అంటారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఇవి కూడా అతి వేగంగా కరిగిపోతుంటాయి.

అర్ధ శతాబ్దం క్రితం ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్వేలు తమ ఎవరెస్ట్ యాత్రను ప్రారంభించిన చోట వున్న హిమనదం దాదాపు అయిదు కిలోమీటర్ల పరిధి మేర అధికంగా విస్తరించింది. శిఖరాన్ని చేరే మార్గంలోని మరో హిమనదం కరిగి పెద్ద సరస్సుగా మారిపోయింది.

ఐక్యరాజ్యసమితి శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం ఎవరెస్ట్ పర్వత ప్రాంతంలోని దాదాపు 44 హిమనీ నదాల్లోని మంచు కరిగి నీరయ్యేందుకు సిద్ధంగా ఉంది. అంటార్కిటికాలోని ఐస్‌బర్గ్‌లు కూడా నీరయిపోయి ప్రవహించడానికి సిద్ధంగా ఉన్నాయి.

సహజీవన సంస్కృతి పెరుగుతోందా?

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారత యువతలోనూ ఇప్పుడు సహజీవన సంస్కృతి పెరుగుతున్నట్లు, దాని పట్ల సానుకూల భావాలు చిగురిస్తున్నట్లు తెలుస్తోంది. సహజీవన విధానం భారత్‌లో చట్ట వ్యతిరేకం కానప్పటికీ, సామాజిక అంగీకారం లేకపోవడం, సహజీవన పద్ధతిని దురాచారంగా కూడా పరగణించడం జరుగుతుంది. భారతంలో మూడు ముళ్లు పడక ముందే 18 యేళ్లు పైబడిన జంట అంగీకారంతో సహజీవన సంసారాలకు సంబంధించిన నిర్దిష్టమైన చట్టాలు కూడా లేకపోవడం విశేషం. డిజిటల్ యుగపు భారత యువతలో రోజు రోజుకు, ముఖ్యంగా మహానగరాల్లో సహజీవన సంసారాలు

పెరుగుతున్నాయని, సగానికి పైగా యువత వీటిని అంగీరిస్తున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లోని ముంబాయి మహానగరం సహజీవన సంసారాలకు కేంద్రంగా నిలుస్తున్నది. సహజీవనానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదా అనుమతులు అవసరం లేదని, విడిపోవు సందర్భాల్లో విడాకులు తీసుకోవడం లాంటి ప్రస్తావన ఉండదని తెలుసుకోవాలి. సహజీవనం చేసిన యువ జంటలు అధిక శాతం వరకు వివాహాలు కూడా చేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సహజీవన సంసారాలు పెరగటానికి కారణాలు

కొన్ని బాలీవుడ్ జంటలు సహజీవనం చేసిన తర్వాతనే వివాహం చేసుకున్నారని తెలిసిన విషయమే. నెమ్మదిగానైనా సమాజం వాటిని అంగీకరించడం జరుగుతున్నది. యువత పెళ్లికి ముందే సహజీవన సంసారాలకు మొగ్గు చూపడానికి ప్రధాన కారణాలు.. వారి మధ్య అభిరుచుల ఏకీకరణ స్పష్టత, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే వివాహం చేసుకోవడానికి నిర్ణయం తీసుకోవడం, గృహ సంబంధ పనులను పంచుకోవడం, పెళ్లి చేసుకోకుండానే శారీరక మానసిక అనుభవాలను స్వంతం చేసుకోవడం, పిల్లల్ని కనడం/పెంచడం భారం అనుకునే యువత, లైంగిక వాంఛలను మాత్రమే తీర్చుకోవడం, పెళ్లికి పూర్వం ఒకరినొకరు అర్థం చేసుకోవడం, ప్రేమతో సహజీవనం చేసి పెళ్లితో ముగింపు పలకడం లాంటి పలు అంశాలను పేర్కొనవచ్చు.

చట్ట అంగీకారాలు

భారత రాజ్యాంగ ఆర్టికల్ 21 ప్రకారం పౌరులకు స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా కల్పించబడిందని, దీని ప్రకారం సహజీవనం నేరంగా పరిగణించబడదని సుప్రీమ్ కోర్టు కూడా పేర్కొనడం విశేషం. అదే విధంగా 2005 గృహ హింస చట్టం ప్రకారం కూడా సహజీవన సంబంధాలను గృహ సంబంధాలుగానే (డొమెస్టిక్ రిలేషన్‌షిప్) చూడాలని నిర్ణయించింది. చట్ట పరిధిలో సహజీవనం చేసిన యువతి కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో భరణం లేదా మెయిన్‌టెనెన్స్ పొందే హక్కు కూడా ఉంటుందని తెలుపుతున్నది. సహజీవన జంట మధ్య విభేదాలు వచ్చినపుడు వెంటనే వారు విడిపోయి తమ తమ జీవితాలను కొనసాగించే వెసులుబాటు ఉన్నది.

పౌర సమాజంలో ఆ జంట కలిసి తిరగడం, ఇద్దరికీ 18 యేండ్లకు పైగా వయస్సు ఉండడం, పెళ్లి అయిన జంటల్లా లైంగిక సంబంధాలను కలిగి ఉండడం, ఇద్దరి ఆదాయాలను కలిపి ఖర్చు చేయడం, గృహ సంబంధ పనుల్లో పరస్పరం సహాయం చేసుకోవడం, ఇద్దరు తమ హక్కులు బాధ్యతలను పంచుకోవడం, సంతానాన్ని కనడం లాంటి ప్రత్యేక సందర్భాల్లో సహజీవనాన్ని కూడా వివాహం జరిగినట్లుగానే భావించాలని పేర్కొనడం జరుగుతోంది.

సహ జీవనం, డేటింగ్ ఒకటేనా?

18 యేండ్లు దాటిన ఒక యువతి, ఒక యువకుడు పెళ్లికి ముందు ఒక అంగీకారానికి వచ్చి ఒకే ఇంట్లో కలిసి జీవించడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి దీర్ఘకాలం పాటు జంటగా జీవించడాన్ని సహజీవనం లేదా లివ్ ఇన్ రిలేషన్‌షిప్ అని పిలుస్తాం. సహజీవనంలో ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకొని ఇష్టపడిన తర్వాత పెళ్లి కూడా చేసుకోవడం జరుగుతుంది లేదా ఇద్దరి అలవాట్లు/అభిరుచులు/ ఆచారాలు/జీవనశైలి/ఆలోచనలు కలవని నిర్ణయించుకున్నపుడు ఆ సహజీవన జంట విడిపోయి స్వేచ్ఛగా బతకడానికి నిర్ణయించుకుంటారు. డేటింగ్‌లో జంట లైంగిక సంబంధాలను తప్పనిసరిగా పెట్టుకోవాలనే నియమం లేకపోయినప్పటికీ అదే ప్రధాన అంశంగా కూడా తీసుకోబడుతున్నది. ఒక జంట మంచి స్నేహితులుగా కలిసి తిరగడాన్ని కూడా డేటింగ్‌గా భావించవచ్చు. డేటింగ్ చేసిన జంట కొంతకాలం తర్వాత సహజీవనం/వివాహ మండపానికి కూడా దారి తీయవచ్చు.

ప్రేమ వివాహాలన్నీ కొనసాగడం లేదనీ, పెద్దలు కుదిర్చిన వివాహాలు కూడా విడాకుల వరకు వస్తున్నాయని గమనించి, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ, పెళ్లంటే ఒక జంట మాత్రమే ఒకటి కావడం కాదని, రెండు కుటుంబాల కలయికగా వివాహాన్ని చూస్తున్న పౌర సమాజంలో జీవిస్తున్నామని తెలుసుకుంటూ నేటి యువత పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించకుండా తమ జీవితాలకు పెళ్లితో చక్కటి శాంతియుత కుటుంబ నిర్మాణ పరిష్కారం ఇవ్వాలని కోరుకుందాం. ప్రేమించిన వ్యక్తిని నేరుగా వివాహం చేసుకోవడం ఉత్తమమని, సహజీవన సంసారం మాత్రం చక్కటి పరిష్కారం కాదని తెలుసుకుందాం. యువత సీతారాములను ఆదర్శ జంటగా తీసుకోవాలని, జీవిత భాగస్వామికి అందరి సమక్షంలో మూడు ముళ్లు వేయాలని ఆశిద్దాం.

ఆనంద'మైత్రేయ'మ్

నిదుర చా..లా సుఖమే!

నిద్ర అనేది జీవితంలో ముఖ్యమైన భాగం. దాని ప్రాముఖ్యతను తక్కువ అని చెప్పలేం. శరీరం విశ్రాంతి, కోలుకోవడానికి అనుమతించే జీవ ప్రక్రియ. శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఇది కీలకం. తిండి తినకుండా ఇరవై నుంచి నలభై రోజుల వరకు ఉండొచ్చు కానీ నిద్ర పోకుండా మాత్రం ఎక్కువ రోజులు ఉండటం అసాధ్యం. ఒక్కరోజు సరిగా నిద్రలేకుంటే పని చేస్తున్నప్పుడు మధ్యలోనే కునుకుపాట్లు, తలనొప్పి ముంచుకొస్తుంటాయి. క్రమబద్ధమైన అలవాట్లను పాటిస్తే మంచి నిద్ర సొంతమవుతుంది. రోజూ నిద్రపోతూనే ఉంటాం. అందుకే నిద్ర గురించి ఎప్పుడూ పెద్దగా పట్టించుకోం. నిశ్చింతగా నిద్ర అన్నది ఏదో కొద్దిమందికి దక్కే అదృష్టంలా తయారైంది. ఆధునిక వైద్యరంగం నిద్ర మీద ఇప్పుడు లోతుగా పరిశోధనలు చేస్తూ నిద్రకు సంబంధించి ఎన్నో ఆసక్తికర అంశాలను, రకరకాల చికిత్సలను ఆవిష్కరిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తల సర్వే ప్రకారం ఓ మనిషి నిద్రపోకుండా 264 గంటలు అంటే 11 రోజుల పాటు ఉండగలడట.

వేగంగా దూసుకెళుతున్న నేటి తరంలో నిద్రపై శ్రద్ధ తగ్గుతోంది. రాత్రిపూట తక్కువ నిద్ర పోవడంతో దాని ప్రభావం ఉద్యోగంపై, చదువులపై తీవ్రంగా ఉంటోంది. నిద్ర మధ్యలో మెలకువ వచ్చినపుడు దాదాపు 61 శాతం వయోవృద్ధుల్లో మెదడు రక్తనాళాలు దెబ్బతినటాన్ని గమనించారు. నిద్ర సరిగా పట్టనందువలన కూడా మానసికంగా ఒత్తిడి ఏర్పడవచ్చు. జీర్ణశక్తి బలంగా లేకపోవటం, మలబద్ధకం, వాతదోషం శరీరంలో వికటించే ఆహార విహారాలు కూడా నిద్రా భంగానికి కారణమవుతాయి. నిద్రలో తేడా వస్తోందంటే తేలికగా అరిగే ఆహారాన్ని, చలవ చేసే పదార్థాలను మాత్రమే తీసుకోవాలి! ఊరగాయలు, మసాలాలు, పులుపు పదార్థాలు, నూనె పదార్థాలను మానటంవలన సగం చికిత్స పూర్తవుతుంది.

నిద్ర పట్టకపోవడానికి కారణాలు

ఒత్తిడి నిద్రలేమికి కారణం. ఒత్తిడి తగ్గించుకోవడం మంచిది. పార్కులో గడపడం.. ఒత్తిడిని అదుపు చేస్తాయి. ప్రతిరోజూ ఓ ఇరవై ని॥ శరీరంపై ఎండ పడేలా చూసుకోండి. టీవీ, ఫోను, ట్యాబ్, కంప్యూటరు లాంటి వాటిని రెండు గంటల ముందు కట్టేయండి. బదులుగా మంచి సంగీతం వినడం లేదా ఓ పుస్తకం చదవడం అలవాటుగా మార్చుకోండి. కనీసం ఓ గం॥ వ్యాయామం/శారీరక శ్రమ చెయ్యటం మంచిది. సా॥ 5 దాటిన తర్వాత టీ, కాఫీలు తాగకండి. నిద్ర విషయంలో కచ్చితమైన సమయం పాటించాలి. అరగంట దాటినా నిద్ర పట్టకపోతే మంచం పైనే అటూ ఇటూ దొర్లటం కాకుండా, గదిలోంచి బయటకు వచ్చి పత్రిక/పుస్తకం చదవటం మొదలెట్టాలి. తిరిగి కళ్లు మూతలు పడుతున్న సమయంలో మంచంపైకి చేరుకోవాలి. నిద్రకు ఉపక్రమించటానికి ముందు గోరు వెచ్చటి నీటితో స్నానం చేయటం, వేడిపాలు తాగటం మంచిది. ఈ జాగ్రత్తలు పాటించినా నిద్ర పట్టకపోతే మాత్రల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది. చేపలు, బీన్స్, పెరుగు, ఆకుకూరలను తినడం ద్వారా మంచి నిద్ర వస్తుందని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. బీన్స్, బఠానీ, చిక్కుడు కాయల్లో బి6, బి12 విటమిన్లతో పాటూ ఫోలిక్ ఆసిడ్స్ ఉంటాయి. బి విటమినే మనకు మంచిగా నిద్రొచ్చేలా పనిచేస్తుందట. ఆకుకూరల్లో ఇనుము శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది కూడా నిద్రలోకి జారడానికి మందులా పనిచేస్తోంది. అలాగే ఫాట్‌లెస్ పెరుగులో కూడా కాల్షియం, మెగ్నీషియం ఉంటాయి. పెరుగులోని కాల్షియం, మెగ్నీషియంల ప్రభావంతో అత్యంత వేగంగా నిద్రలోకి జారుకుంటారని వైద్యులు చెబుతున్నారు.

నిద్రాభంగాలకు ముఖ్య కారణం ఒత్తిడి, ఉద్రేకతలు నిద్రకు భంగం కలిగిస్తాయి. కాబట్టి నిద్రలేమితో ఇబ్బంది పడుతున్న వారు బి విటమిన్ ఉన్న పదార్థాలు, రెండు రోజులకోసారి ఆకుకూరలు తీసుకోవడంతో పాటూ పెరుగు తినడం ద్వారా నిద్రలేమిని దూరం చేసుకోవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. గోరువెచ్చని పాలు నిద్రని ఆహ్వానిస్తాయని మన పెద్దల కాలం నుంచీ వస్తున్న ఆనవాయితీ. మెదడును శాంతపరిచి నిద్ర కలిగించే నాడీ ప్రసారకాలు(న్యూరోట్రాన్స్ మీటర్), ట్రిటోఫాన్ దాదాపు అన్ని పాల ఉత్పత్తుల్లోనూ ఉంటుంది. ఒక గ్లాసు పాలు (చక్కెరగానీ మరేదైనా తీపి పదార్థం కాని చేర్చకుండా) రాత్రి బాగా పొద్దుపోయాక తాగినా, లేదా మీ రాత్రి భోజనంలో పన్నీర్లాటివి తీసుకున్నా మీకు అందవలసినంత ట్రిటొఫాన్ అందుతుంది. పాలతో తయారైన అన్ని పదార్థాల్లోనూ ట్రిటొఫాన్ ఉంటుంది. తక్కువ నిద్ర, ఎక్కువ నిద్ర ఈ రెండూ ఆరోగ్యానికి మంచివి కావు. అప్పుడే పుట్టిన పిల్లలు 18 గంటలు నిద్ర పోవాలని, చిన్న పిల్లలు 11 గంటలు నిద్రపోవాలని, టీనేజిలో ఉండేవారు 10 గం॥ నిద్రపోవాలని నిపుణులు అంటున్నారు. నిద్రలేమికి కారణం అనారోగ్యమని చెప్పడం కష్టమనీ, కానీ నిద్రలేమి, అనారోగ్యం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని లండన్‌లో ట్రినిటీ కాలేజ్ ప్రొఫెసర్ షేన్ ఓమారా తెలిపారు. నిద్రలేమి అనేది కొందరిలో రెండు మూడు వారాల తర్వాత దానంతట అదే సద్దుకుంటుంది. కనుక వెంటనే మందులు వాడకపోవటం మంచిది. మనసుని ఇతర కార్యక్రమాలపై మళ్లించటం, నడక, వ్యాయామం వంటి వాటి వల్ల తిరిగి మామూలు స్థితికి వచ్చే అవకాశం ఉంటుంది. నిద్ర పట్టేందుకు ఇచ్చే మందులు కేవలం చివరి మార్గంగానే వాడాలి. ఈ మందులను మూణ్నెళ్ల పాటు వరుసగా వాడుతుంటే శరీరం వాటికి అలవాటు పడిపోతుంది. వాటి మోతాదు పెంచితే ఇతరత్రా దుష్ప్రభావాలు చాలా ఎక్కువ. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపిస్తాయి. వీటిని దీర్ఘకాలం వాడకూడదు. చక్కటి నిద్ర జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకున్న తర్వాత నిద్రపోతే అది బాగా గుర్తుంటుందని ప్రయోగాల్లో రుజువైంది.

కథ

పునర్జన్మ

బొమ్మిరెడ్డిపల్లి ఇందిర

రామారావు ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఈ చేశాడు. డిస్టింక్షన్లో పాసయ్యాడు. చదువైన వెంటనే బాంబేలో ఉన్న ఒక పెద్ద అటామిక్ సంస్థలో శాస్త్రవేత్తగా ఉద్యోగం దొరికింది. అక్కడ పనిచేసి పెద్ద పదవిలో రిటైరు అయ్యాడు. రిటైర్మెంట్ తర్వాత కూడా 15 సంవత్సరాలు పెద్ద పెద్ద కంపెనీలకి దేశ విదేశాల్లో సలహాదారుడిగా పని చేశాడు. రిటైర్మెంట్ తరువాత కూడా ఆయన జీవితం బిజీగా గడిచింది. నెలలో కనీసం మూడు నాలుగు విదేశీ యాత్రలు ఉండే.వి ఇంట్లో ఉన్నప్పుడు కూడా రిపోర్టులు రాయటంలో కాలం బిజీగా గడిపేవారు.

రామారావుది ప్రేమ వివాహం, తనతో పనిచేసే తన జూనియరైన లలితని పెళ్లి చేసుకొన్నారు. ఆ అమ్మాయి మరాఠీ వాళ్ళైనా తల్లి తండ్రులని ఒప్పించి వివాహం చేసుకొన్నాడు. అందుకే వాళ్ల ఇంట్లో తెలుగు వంటకాలతో పాటు బొంబాయి వంటలు కూడా ఘుమ ఘుమలాడుతుంటాయి. వాళ్లింట్లో ఇంకో విశేషం: రెండో కోడలు రాజస్థానీ అమ్మాయి అవటంవలన ఉత్తర భారతీయ వంటలు కూడా చాలా తరచుగా ఆ ఇంటి వంటల్లో కనిపిస్తూ ఉంటాయి.

రామారావుకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. రంగా, రాజా కూడా పెద్ద చదువులు చదువుకొని హైదరాబాద్‌లోనే ఒకరు గూగుల్ కంపెనీలో, ఇంకొకరు మైక్రోసాఫ్ట్ కంపెనీలోను పని చేస్తున్నారు. ఇద్దరు కోడళ్లు కూడా పెద్ద కంపెనీల్లో పని చేస్తున్నారు. అల్లుడు రాజేంద్ర ఢిల్లీలో గవర్నమెంటులో ఉన్నతమైన పదవిలో ఉన్నాడు. అలా రామారావు కుటుంబం బాగా స్థిరపడింది.

రామారావు చేసింది పెద్ద ఉద్యోగం కాబట్టి బాగా సంపాదించాడు. తన అంతస్తుకు తగ్గట్టే హైదరాబాద్ జూబిలీహిల్స్ లో 600 గజాలలో పెద్ద ఇల్లు కట్టుకున్నాడు. మొత్తం ఫ్యామిలీ అంటే కొడుకులు, కోడళ్లు, మనుమలు ఇంకొక వంద సంవత్సరాలు హాయిగా ఉండేటట్లు ఇంటిని కట్టుకొన్నాడు. అందుకనే ఆయన ఇంట్లో కుడా ఒక రూముని ఆఫీసుగా వాడుకొనేవాడు. అక్కడ ఒక పెద్ద టేబులు, ఒక లాప్టాప్, ప్రింటర్, పెద్ద బీరువా ఉన్నాయి. బీరువా అయన పుస్తకాలు, ఆయన రాసిన రిపోర్టులతో నిండిపోయింది. అవే కాకుండా 3 సోఫాలు, 2 టీపాయిలు ఆ రూములో వున్నాయి. సాయంత్రం టైములో తరచు ఆప్తమిత్రులు, చాలా దగ్గర బంధువులతో ఆయన కాలక్షేపం చేసేవాడు. రామారావుకి బంధుప్రీతి ఎక్కువ. కనీసం నెలకొకసారైనా ఇంటిదగ్గరే పార్టీలు ఇచ్చేవాడు. ఆయన సతీమణి లలిత కూడా సంతోషంగా ఏర్పాట్లు చేసేది.

అలా సుఖ సంతోషాలతో ఉన్న రామారావుకి జబ్బు చేసింది. జబ్బు నిర్ధారణ కాలేదు కానీ తను చాలా నీరసించిపోయాడు. గత ఆరు నెలలుగా ఎన్నో పరీక్షలు చేయించుకున్నాడు. ఒకసారి హాస్పిటల్లో చేరి 3 రోజులు ఉండాల్సి వచ్చింది. చాలామంది డాక్టర్లని సంప్రదించాడు. వాళ్లిచ్చిన మందులన్నీ వాడుతున్నాడు. కేన్సరని కెమోథెరపి కూడా చేయించుకున్నాడు. ఇప్పుడు మంచానికి అతుక్కుపోయి కాలం గడుపుతున్నాడు.

ఇలా ఏడాదిన్నర గడిచింది.

ఆ రోజు ఆదివారం. కొడుకు రంగా మిగిలిపోయిన ఆఫీసు పనులను లాప్ టాపులో ముగించుకొని యథాలాపంగా తండ్రి ఆఫీసు రూములోకి వెళ్ళాడు. తండ్రి ఆఫీసు రూములో కెళ్లగానే రంగాకి ఇవన్నీ అర్థమయ్యాయి. ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే తండ్రి ఇలా జబ్బుపడి నిస్తేజంగా జీవితం గడపటం తలచుకొంటే కళ్ళనిండా నీళ్లు తిరిగాయి. దుఃఖం అపుకోలేకపోయాడు. బోరున ఏడుస్తూ తండ్రి కుర్చీలో కూలబడిపోయాడు. కొంతసేపటికి తేరుకొని రూమంతా కలయచూశాడు. నాన్న హడావిడి మనిషి, ఎప్పుడూ ఖాళీగా ఉండేవాడు కాదు. నాన్న ఇంట్లో ఉన్నప్పుడు అందరూ ఉత్సాహంగా ఉండేవారు.

నాన్న స్నేహితులతో కలిసి ఈ రూములో కాలక్షేపం చేయటం గుర్తుకొచ్చింది. చాలా సంతోషంగా కాలం గడిపేవారు. స్నేహితులతో కాలం గడపటం ఆయనికి ఎంతో ఇష్టం. నాన్న స్నేహితులతో ఎప్పుడూ కూచున్నా అమ్మ వేడి వేడి స్నాక్స్ పంపించేది.

ఆయనకి మిర్చిబజ్జి అంటే అమిత ఇష్టం. ఎప్పుడూ తన చిన్నతనంలో తిన్న మిర్చీలని జ్ఞాపకం చేసుకొనేవారు. అవే కాకుండా వడాపావ్, బేల్పూరి లాంటివి కూడా లలిత చేసేది. ఆ రోజులు సరదాగా ఉండేవి. అప్పుడప్పుడు తాను కూడా వాళ్ళతో కూచునేవాడు.



లాప్ టాపులో ఒక్కొక్క ఫైల్‌చూడసాగాడు. చాలా మటుకు నాన్న చేసిన పనులకు సంబంధినవే ఉన్నాయి. ఇంక లాప్ టాపు మూసేద్దామని అనుకొనేంతలో ఒక ఫైలు పేరు. కనిపించింది. దాని పేరు నా ఆఖరి మజిలీ, నాన్న తన అభిప్రాయాలని రాసుకొన్నట్లుంది అని అనుకొని ఇంట్రెస్టింగా చదవటం మొదలుపెట్టాడు రంగా.

అలాగని ఇంట్లో వాళ్లతో ముభావంగా వుండేవారు కాదు. మనవళ్లు మానమరాళ్లంటే ఎంతో ఇష్టం, కూతురి పిల్లలంటే మరీ ఇష్టం, కూతురు ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా ఆయన సంతోషానికి పట్టపగ్గాలుండేవి కావు, కొడుకులతో ముఖ్యంగా తనతో చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు.

నాన్నకి జబ్బు చేసి ఏడాదిన్నర పైనే అయింది. అప్పటి నుంచి ఈ రూము బోసిపోయింది. ఎవరూ ఈ రూము వాడలేదు. నాన్న స్నేహితులు అప్పుడప్పుడు వచ్చి నాన్న ఆరోగ్య పరిస్థితి కనుక్కునేవారు. ఈ మధ్య కాలంలో వారి రాక బాగా తగ్గిపోయింది.

కొంతసేపటికి తమాయించుకొని తండ్రి లాప్ టాపుని తెరిచాడు. అప్పుడు తండ్రి అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఆయనికి బాగా సీరియస్‌గా ఉన్నప్పుడు తన చేతిని పట్టుకొని "నా కంప్యూటరుకి పాసువర్డు లేదు. నువ్వెప్పుడైనా చూడదల్చుకొంటే చూడొచ్చు..." అని చెప్పాడు. ఇవ్వన్నీ గుర్తుకొచ్చి రంగా మనస్సు మరింత ఆర్థ్రమైపోయింది. టేబులు మీద వున్న నాన్న తాగే ఇంపోర్టెడ్ సిగార్లున్న డబ్బాని ప్రేమగా చేతిలోకి తీసుకొన్నాడు. నాన్న సిగార్లంటే చాలా ఇష్టపడేవాడు. కానీ అనారోగ్యం ముదరటం వలన 6 నెలల నుంచి సిగార్లు తాగటం మానేశాడు.

ఇవన్నీ రంగాకి జ్ఞాపకం వచ్చాయి. లాప్ టాపులో ఒక్కొక్క ఫైల్ చూడసాగాడు. చాలా మటుకు నాన్న చేసిన పనులకు సంబంధినవే ఉన్నాయి. ఇక లాప్ టాపు మూసేద్దామని అనుకొనేంతలో ఒక ఫైలు పేరు నా ఆఖరి మజిలీ అని కనిపించింది.

ఇందులో నాన్న తన అభిప్రాయాలని రాసుకొన్నట్లుంది అని అనుకొని ఇంట్రెస్టింగా చదవటం మొదలుపెట్టాడు రంగా.

".. ఈరోజే సింగపూర్ నుంచి వచ్చాను. ఎయిర్ పోర్టులోనే ఏదోలా అనిపించింది. ఇంటికొచ్చిన వెంటనే . రెస్టు తీసుకోవాలనిపించింది. లలిత కూడా మీరు ఎలాగో వున్నారని అంది మీ మిత్రులిని ఎవరినీ ఇవ్వాళ రావద్దని చెపుతానంది" "సరేనని.." చెప్పి రూములోకెళ్లి పడుకొన్నాను.

మర్నాడు ఫామిలీ డాక్టరైన ఆనందు దగ్గరకెళ్ళాను. ఆయన కొన్ని టెస్టులు చేయించుకొని రమ్మన్నాడు. ఆ రిపోర్టులు చూసి స్పెషలిస్ట్ డాక్టరైన మధు దగ్గరికి పంపించాడు. "మీకు కేన్సరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మీరు ఈ మందులు, ఇంజెక్షన్లు 4 నెలలు వాడండి" అన్నాడు.

ఆయన చెప్పిన మాటలు విని గుండె గుభేలుమంది. నాలాంటి బిజి మనిషికి ఇలాంటి జబ్బు ఎలా వచ్చిందబ్బా అని అనుకొన్నా, ఈ విషయం ఇంట్లో ఎవరికి చెప్పకూడదని నిశ్చయించుకొన్నాను. డాక్టరుని కుడా రహస్యంగా ఉంచమని రిక్వెస్టు చేశాను.

ఆయన చెప్పిన ఇంజెక్షన్లని 4 నెలలు వాడాను. అయినా ఆయాసం, తల తిరగటం లాంటివి తగ్గలేదు. అయినాసరే ఇంట్లో వాళ్ళకి ఏమి చెప్పలేదు. అలా ఆరు నెలలు నెట్టుకొచ్చాను.

ఇక లాభం లేదనుకొని ఇంకొక స్పెషలిస్ట్ డాక్టరు దగ్గరకెళ్ళాను. ఆయన రిపోర్టులు చూడగానే చెప్పేశాడు. మీకు ఒక రకమైన బ్లడ్ కేన్సర్ ప్రారంభ దశలో వుంది. కీమోథెరపి ట్రీట్‌మెంట్ మొదలెట్టాలని చెప్పాడు.

అప్పుడు లలితకి చెప్పాను. మొదట్లో భయపడింది. నేను సముదాయించిన తరువాత ఒప్పుకొంది.

ఇప్పుడు జీవితమే ఒక సమస్యగా మారింది. విపరీతమైన అలసట. ఏ పని చేసినా ఆసక్తిగా ఉండటంలేదు. దానికి తోడు ఆయాసం, అప్పుడప్పుడు విపరీతంగా వస్తుంది. కొద్దీ సేపున్న తరువాత తగ్గిపోతుంది. అలాగే ఎముకలు, కండరాలు బాగా నొప్పెడుతుంటాయి. చాలా తొందరగా అలసిపోతాను. ఎంతో దూరం నడవలేకపోతున్నాను. మహా అంటే వంద అడుగులు నడవగలనేమో. వెంటనే ఆయాసం వచ్చేస్తుంది. ఇవన్నీ ఈ వ్యాధి లక్షణాలు. అవి నాకొచ్చాయి.

కీమోథెరపీ తీసుకొంటే ఏడాది నుండి మూడేళ్లవరకు జీవితాన్ని పొడిగించుకోవచ్చు. అదృష్టం బావుంటే ఎనిమిదేళ్ల వరకు బతకొచ్చు. డాక్టర్లు చెప్పినవి, గూగుల్లో చదివినవి ఇలా మస్తిష్కంలో ఉండిపోయాయి. నేనెంత కాలం బతుకుతానో పాలుపోవటంలేదు. ఈ ఆలోచనలతోనే రోజులు గడిచిపోతున్నాయి. ఒక లాటరీలా వుంది. ఏమీ పాలువపోవటం లేదు.

ఇప్పుడు బెడ్ రూము వదిలి బయటకు వెళ్లలేకపోతున్నాను. అందుకే లాప్ టాపుని బెడ్ రూములోకి తెచ్చుకొన్నాను. ఎప్పుడు వంట్లో బాగుంటుందో అప్పుడు లాప్టాప్ వాడుతున్నాను. నా పిచ్చిగాని నేను రాసింది ఎవరు చదువుతారు. నా తృప్తి కోసమే నేను పడే బాధని రాసుకొంటున్నాను.

నేను జబ్బుపడి ఏడాది దాటింది. నా పరిస్థితే ఇలా ఉంటే ఇంట్లోవాళ్ల సంగతేమిటి. వాళ్లకు నా కన్నా భయం బాధ ఉంటాయి. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల వాళ్లెంత బాధ పడుతున్నారో. కూతురు మూడు సార్లు వచ్చిపోయింది. తన్ని అంటిపెట్టుకునే ఉండేది. ఇక లలిత సంగతి సరే సరి. తన్ని ఒక్క క్షణం కూడా వదిలి ఉండటంలేదు. కొడుకులు రోజుకి కనీసం నాలుగైదు సార్లు వచ్చి కూచుంటారు. మనవళ్లు, మనవరాళ్లు వచ్చి దగ్గర కూచున్నప్పుడు మనసుకి హాయిగా ఉంటుంది. వాళ్లు వాళ్ల స్కూలు సంగతులు చెబుతుంటే నా జబ్బు సంగతే మర్చిపోతాను.

ఈ రోజు డాక్టరు దగ్గరకెళ్ళాలి. ఆయన ఏమంటాడో! కీమోథెరాపి కంపల్సరీ అంటాడేమో! అని లోలోపల భయంగా వుంది. కానీ రంగాకి నా భయాల్ని చెప్పలేదు. లలిత కూడా వస్తానంది. అందరం కలసి డాక్టరు దగ్గరకెళ్ళాం.

మమ్మల్ని చూడగానే ఆయన అదేమిటి? ఇంత ఆలస్యం చేశారెందుకన్నాడు? రేపు ఫస్టు కదా. రేపట్నుంచి మొదలు పెడదాం.

అలా నా ట్రీట్‌మెంట్ మొదలైంది.

నెలకి వారం రోజుల పాటు ప్రతి రోజూ ఇంజెక్షన్లు తీసుకోవాలి. అలా నాలుగు నెలలు గడిచాయి. మొదట్లో వికారం, తిండి సహించకపోవటం, అజీర్ణం, జుట్టూడిపోవటం వంటివి నన్ను చాలా బాధ పెట్టాయి. రానురాను అలవాటైపోయాయి.

ఇవ్వాళ చాలా ఉపశమనంగా వుంది. ఎందుకంటే డాక్టరుగారు ట్రీట్మెంట్ అయిపోయిందని. ప్రకటించారు. నెల తరవాత రమ్మన్నారు.

ఇంటికెళ్లగానే నేను చేసిన మొట్టమొదటి పని వీలునామా రాయటం. నా మిత్రుడు గోపాలరావు ఒక పేరు పొందిన లాయరు. ఆయన సహాయంతో వీలునాను తయారు చేశాను. మంచిరోజు చూసుకొని రిజిస్టరు చేద్దామన్నాడు గోపాలరావు. ఎందుకైనా మంచిదని వీలునామా కాపీ మీద నేను ంతకం చేసి, లాయరు గారిచేత సాక్షి సంతకం చేయించాను. ఇప్పుడు మనసు కుదుటపడింది.

ఈ రోజు హాయిగా వుంది. కూతురిని చూడాలని వెంటనే రమ్మని ఫోను చేశాను. లలితతో చెప్పా.. సాయంత్రం ప్లైటులో అమ్మాయి వస్తోందని, ఇవ్వాళ రాత్రి భోజనం అందరు కలసి చేద్దామని కొడుకులకి కోడళ్ళకి చెప్పమని లలితకి చెప్పాను. ఈ రాత్రి ఎంతో సంతోషంగా సరదాగా గడిచింది. నా కుటుంబాన్నంతా అంత సంతోషంగా చూడగానే నా మనస్సు ఉప్పొంగిపోయింది. రంగాని ఒక సెల్ఫీ ఫొటో అందరు కనిపించేటట్టు తీయమన్నాను. ఫొటో చాలా బాగా వచ్చింది.

నాన్న రాయటం అయిపొయింది. రామారావు రాసింది చదివిన తరువాత రంగా మనసు దుఃఖంతో బరువెక్కింది.

కీమోథెరపీ అయినా తరువాత కుడా రామారావు ఆరోగ్యం కుదుటపడలేదు.. ఇంకా ఆరోగ్యం క్షీ ణించింది.

అలా వారం గడిచింది. ఒక రోజు రంగాకి కేన్సర్ హాస్పిటల్ నుంచి డాక్టరుగారి ఫోను వచ్చింది. డాక్టర్ జాన్ అని అమెరికా నుంచి ఏదో మీటింగుకి వచ్చారుట. ఆయన పది రోజులు హైదరాబాద్‌లోనే ఉంటారట.

ఆయన నాన్నకొచ్చిన జబ్బు మీద చాలా పరిశోధనలు చేశాట్ట. నాన్నని ఆయనకి చూపిస్తే బాగుంటుంది. అందుకే నాన్నని తీసుకురమ్మని డాక్టర్ చెప్పాడు.

మర్నాడు అప్పాయింట్మెంట్ తీసుకొని తండ్రిని హాస్పిటల్కి రంగా తీసుకెళ్లాడు. హాస్పిటల్లోనే ఒక వారం ఉంచమన్నారు. హాస్పిటల్ అడ్మిషన్ అయిన తరువాత రంగా డాక్టర్లని కలిశాడు. నాన్నకొచ్చిన జబ్బుక్ ఇండియాలో మందు లేదని, అయినా అమెరికా డాక్టర్ తనకున్న అనుభవంతో ట్రీట్మెంట్ చేస్తాడని తెలుసుకొన్నాడు. ఇలాంటి కేసుల్ని ఆయన కొన్ని నయం చేశాడని విన్న తరువాత రంగాకి ప్రాణం లేచొచ్చింది. ఎంత ఖర్చైనా పర్వాలేదని ట్రేటుమెంటు కొనసాగించమని హాస్పిటల్ వాళ్లకి చెప్పాడు.

పది రోజుల తరువాత అమెరికా డాక్టర్ వెళ్ళిపోయాడు. వెళ్ళేముందర రంగాకి ఒక శుభవార్త చెప్పాడు. నాన్న ఆరోగ్యంలో మార్పు వస్తోందని చికిత్సకి సహకరిస్తున్నాడని తెలిసి చాలా సంతోష పడ్డాడు. ఇంకొక పదిరోజులు ఆసుపత్రిలో ఉండాలని డాక్టర్లు చెప్పారు. రంగా ఆనందం అణుచుకోలేక అమ్మకి, తమ్ముడికి, చెల్లెలికి ఫోను చేసి శుభవార్త చెప్పాడు.

పది రోజుల తర్వాత రామారావుని హాస్పిటల్ నించి డిశ్చార్జి చేశారు.

పూర్ణ ఆరోగ్యవంతుడై తిరిగి వచ్చిన రామారావుకి ఇంటి బయటే ఎర్ర నీళ్లతో దిష్టి తీసి ఇంట్లోకి తీసుకెళ్లారు కుటుంబ సభ్యులు. భార్యని కొడుకులని కూతుర్ని మనుమలని గాఢంగా గుండెకు హత్తుకున్నాడు రామారావు..

ఇప్పుడు మళ్ళీ బంధు మిత్రులతో యధావిధిగా కళకళలాడసాగింది రామారావు ఇల్లు. ■

హాస్య కవిత

ఓ...

నా ప్రియ శాంతా
సంక్రాంతి కాంతివై రావా
సంబరాలు
జరుపుకొందాం
రావే
అందమైన రంగుల
ముగ్గుల
సిగ్గులదానా!
గొబ్బెమ్మల
పాటవై
రావే
కొత్త
ధాన్యరాశుల
కన్నా
పెద్ద మనసున్నదానా
అరిసెల కన్నా తియ్యని
బుగ్గలదానా

నేతిగారెల కన్నులదానా
కారప్పూస కన్నా కరకరలాడే
వయసున్నదానా
ఓ మైనా... నా మైనా..!
పచ్చని తోరణాల కన్నా
పొడవైన జడదానా
రంగుల గాలిపటమై
రావే
హరిదాసునడిగాను నీ చిరునామా
బుడబుక్కలయ్యను అడిగాను
నీ జాడ ఏదని..?
గంగిరెద్దునడిగాను నా చెలి ఏదని?
రావే నా ప్రియా
భోగిమంటలలో చలికాచుకొందాం
ఎడ్లపందేలు చూసి ఆనందిద్దాం
సంక్రాంతి సంబరాలై రావే నా చెలీ
మలి సంక్రాంతి వరకు నీ కోసం
ఎదురు చూస్తూ వుంటా నా
ప్రియా!

- సంపంగివారి జయచంద్రారెడ్డి

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

ఏదీ! తెలుగు?

జయసూర్య

ఆంగ్లభాషలో విద్యాబోధన పట్ల తెలుగు మేధావులను 4వ ప్రపంచ మహాసభల సందర్భంలో నిరసన గళం వెల్లువెత్తి కదిలించింది. 2019 సంవత్సరాన్ని అంతర్జాతీయ మాతృభాషల పరిరక్షణ సంవత్సరంగా, ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో నాటి మహసభల వేదిక గుండె తలుపులు తట్టే లక్ష్యంతో ప్రతిధ్వనించింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, రచయితలు, భాషాభిమానులు, వివిధ రంగాల మేధావులు, రాజకీయ రంగ ప్రముఖులు సైతం అమ్మభాషను రక్షించుకోవలసిన పరిస్థితి తల ఎత్తిందని నాడు ఆందోళన వ్యక్తం చేసారు.

కొమర్రాజు, గిడుగు, సురవరంలను తెలుగుజాతి వైతాళికులుగా, అమ్మభాషకు వున్న ఘన వారసత్వ ప్రాభవాన్ని నాటి ప్రసంగ ప్రముఖులు గుర్తు చేసారు. ప్రతి ఒక్కరూ యిక భాషా సత్యాగ్రహులుగా మారాల్సిన సమయం ఆసన్నమైందని, ఆంగ్ల బానిసత్వంలోకి మనల్ని నెట్టివేసే విధంగా మాతృభాషను నిషేధించే దుస్థితి ప్రాప్తించిందని మహాసభ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక విద్యకు మాతృభాషను మాధ్యమంగా ఉంచాలని, పిల్లలలో మాతృభాష పట్ల ప్రేమ, గౌరవం పెరిగేలా, ద్వేషరహితమైన విద్యావ్యవస్థ ఉండాలని మహాసభ ఆకాంక్షించింది. ఇంటి తల్లిపలుకును, బడిచదువు భాషగా, ఏలుబడి భాషగా వర్థిల్ల చేయాలనే తపన సర్వత్రా నాటి ప్రభుత్వ నిర్ణయం పట్ల అసంతృప్తి, నిరసన, ఆగ్రహావేశాలు ప్రదర్శింప చేసారు.

ఊరూరా తెలుగు వేదికల ఏర్పాటుకు పిలుపు యిచ్చారు. బలవంతంగా ఆంగ్లంలో చదివించడం వల్ల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుందని హెచ్చరించారు. 11 తీర్మానాలు ఆమోదింపబడి 4వ ప్రపంచ తెలుగు మహాసభ నిర్మాణాత్మక ఉద్యమ సారథ్యానికి నడుం బిగించింది.

అమ్మభాషను రక్షించుకోవటానికి స్వాభిమానం చాటుకొనే శక్తివంతమైన భాషోద్యమ నిర్మాణ అగత్యం తల ఎత్తిందని నాటి మహాసభలలో తెలుగు మాధ్యమం పైనే ఎక్కువ చర్చ నిర్వర్తించబడింది. సంపన్నులు, పెద్దలు, రాజకీయ ప్రముఖులు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారో తాము ముందుగా ఆలోచించుకొని వ్యవహరించాలని కొందరు వాదనలు కూడా వినిపించారు.

అ ఆ ఇ ఈ ఉ ఊ
ఋ ౠ ఎ ఏ ఐ
ఒ ఓ ఔ అం అః
క ఖ గ ఘ ఙ
చ ఛ జ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ శ
ష స హ ళ క్ష ఱ

2020 నూతన సంవత్సర ఆరంభంలో వేకువ మరింత వేడెక్కకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరైన చర్యలను సత్వరం చేపట్టాలని మహసభ రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసింది. 2020 జనవరి నుంచి 2025లోకి అడుగుపెట్టాం. తెలుగుభాషకు విద్యాసంస్థలలో అభిమానం, ఆదరణ అలాగే వుంది. ఆంగ్ల మాధ్యమ విద్యాబోధన అలవాటు అవుతోంది.

ఇంటర్మీడియట్ నుండి ఎక్కువ మార్కుల కోసం జర్మనీ, ఫ్రెంచ్, సంస్కృతం వంటివి ఎంచుకొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రోత్సాహకంగా 5 శాతం రిజర్వేషన్ వంటి భాషాభిమానుల డిమాండ్ ప్రభుత్వం నెరవేర్చే సూచనలు కనపడటంలేదు. 6వ ప్రపంచ తెలుగు మహసభ వేదికపై నుంచి ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్, మాతృభాషను నేర్చుకొన్న పిల్లలలో సృజనాత్మకత ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిదండ్రుల చొరవతోనే మాతృభాష మనుగడ సాధ్యపడుతుంది అంటూ మన తెలుగుభాష ఎప్పటికీ నిలిచి ఉంటుందని అన్నారు. 5వ తరగతి వరకు మాతృభాషలో బోధన చేయాలని జాతీయ విద్యా విధానంలో స్పష్టంగా చెప్పారని విశ్రాంత ఉన్నత అధికారి జెడి లక్ష్మీనారాయణ గుర్తు చేసారు. పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరిగా ఉంచేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇక ఈ జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు 11 రోజుల పాటు సాగిన 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో 200కు పైగా కొనుగోలు దుకాణాలు ఏర్పాటు చేసారు. ఈసారి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణ కర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

103 మంది ఆంగ్ల ప్రచురణ కర్తలు పుస్తక దుకాణాలు ఏర్పాటు చేసారు. యువతీ యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా ఆంగ్ల పుస్తకాలు కొనుగోలు చేసారు. పుస్తకాల పండుగలో విజయవంతంగా పెద్ద సంఖ్యలో పుస్తకాల అమ్మకం తప్ప తల్లిభాష ఊసుకు సంబంధం లేదు. తల్లిభాష తెలుగును కాపాడుకోవాలనే తపనతో శతాబ్దం క్రితం దక్షిణాపథాన తెలుగుభాషను బతికించడానికి ఒక ఉద్యమం తల ఎత్తింది.

తెలుగురథమేమొ కదిలింది చూడండి!
శక్తివంచన లేక సాయం చేయండి!
తెలుగుభాష పరువును కాపాడ దలచండి!
తెలుగువారల కష్టాలు తలచండి!
జయము పొందెడి దాకా
శాంతంబు లేదండి!
జయభేరి....జయభేరి....జయభేరి....
మోగింది జనులారా లేవండి!

తెలుగు భాషోద్యమం కోసం తమిళనాడులోని తామ్రపణి నదీతీరాన వెలసిన తిన్నవెల్లి (తిరునల్వేలి) పట్టణంలో, తెలుగు భాషోద్యమ నేత సాధు వారదరాజం పంతులు,

(మిగతా 27వ పేజీలో)

నిరాడంబరం అంటే?

యామిజాల జగదీశ్

"నేనెవరో తెలుసా?" అని గంభీరంగా అడిగేవారు మన చుట్టూ ఎంతో మంది తారసపడుతుంటారు. అయితే అటువంటి వారిని కొందరు "అదేదో మీరే చెప్పండి తెలుసుకుంటాం!" అని చెప్పేవారూ ఉంటారు.

అప్పుడా వ్యక్తి "ఆ విషయం నన్నెందుకు అడుగుతున్నారు... ఊళ్ళో నలుగురునీ అడిగి తెలుసుకోమంటాడు".

ఆ మేరకు అతను తన గురించి తెలుసుకున్నాడన్న మాట.

ఒక జ్ఞాని తన వద్దకు వచ్చిన ఓ వ్యక్తిని చూసి "నేను నేను అని మాటిమాటికి చెప్తున్నావు కదా.... ఆ నేను ఎక్కడి నుంచి వస్తోంది అని" అన్నారు.

శిశువుగా ఉన్నావు కదా! అది నువ్వా?

బాలుడిగా ఎదిగావు కదా! అది నువ్వా?

ఆ తర్వాత యువకుడిగా మారావు.. అది నువ్వా?

అనంతరం నడివయస్కుడివయ్యావు. అది నువ్వా?

ఆ తర్వాత వృద్ధుడిగా మారుతావు కదా అని నువ్వా?

వీటిలో ఏ నువ్వు నువ్వు అని అడిగారు జ్ఞాని.

నేను అనేది మానసికమైనది... అంతేతప్ప దానికో రూపం అంటూ ఏమీ లేదు" అన్నారు జ్ఞాని.

ఓ రాజు చాలా కాలం సంతోషంగా బతకాలని ఆశ పడ్డాడు. అందుకు ఏమన్నా మార్గముంటే చెప్పమని అడిగాడు. అహంకారమనేది లేనివాడు దీర్ఘకాలం హాయిగా బతుకుతాడని ఒకరన్నారు.

ఆ మాటతో రాజు అహంకారం అనేది లేకుండా బతకాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆలోచించాడు. తనను తాను ప్రశ్నించుకున్నాడు. డబ్బు, ఆడంబరం అనేవి ఎక్కువవుతున్నకొద్దీ అహంకారమూ అధికమవుతుంది. కనుక అహంకారమనేది లేకుండా ఉండాలంటే నిరాడంబరంగా బతకడం అలవాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ఖరీదైన వస్త్రాలన్నింటినీ విడిచిపెట్టాడు. కోటను విడిచిపెట్టి ఓ ఊరిపాకలో ఉండసాగాడు.

కొన్ని రోజులైంది.. ఆ తర్వాత అతను తన గురించి ఆలోచించాడు.

ఆహా, నాలాగా నిరాడంబరంగా బతుకుతున్న వారు ఈ లోకంలో ఎవ్వరూ లేరు అని పదే పదే అనుకునేవాడు.

ఆ తలపు అతనిని అహంకారిగా మార్చింది. రోజులు గడిచేకొద్దీ ఆ పొరపాటుని గ్రహించాడు. దాని గురించి మళ్లీ జ్ఞానిని కలిశాడు. విషయం చెప్పాడు. రాజు చెప్పిన మాటలన్నీ విన్న జ్ఞాని "ఇదిగో చూడు రాజా, నువ్వు రాజుగారిలా మంచి దుస్తులు ధరించు, రాజులా బతుకు...

ప్రజలు నిన్ను ఎప్పట్లా గౌరవిస్తారు. ఆ గౌరవాన్ని పొందు. అనుభూతి చెందు" అని మళ్లీ–

"కానీ నువ్వు నీ మనసులో నిరాడంబరంగా ఉండటం అలవాటు చేసుకో!" అని జ్ఞాని వెళ్ళిపోయారు.

ఆ తర్వాతే రాజుకి అసలు విషయం అర్థమైంది. నిరాడంబరం అంటే ఏమిటని, మానసికంగా అలా ఉండటం ఎంత కష్టమో తెలుసుకున్నాడు.

....

అనగనగా ఓ గురువున్నారు. ఆయన దేశ సంచారం చేస్తూ చేస్తూ ఓ ఊరుకి వెళ్ళారు.

ఆ ఊళ్ళోని వారందరూ ఆయనను చూసారు. వారందరూ ఒక చోట గుమికూడారు. మన ఊరికి కొత్తగా ఓ గురువు వచ్చాడు. ఏం చేయాలా అని ఆలోచించారు. ఈరోజు సాయంత్రం ఆయనకు అందరం కలిసి ఘనంగా స్వాగతం పలుకుదాం... అని అందరూ కలిసి నిర్ణయించుకున్నారు.

సాయంత్రం తాము ఏర్పాటు చేయబోయే స్వాగత కార్యక్రమంలో పాల్గొనాలని ఆయనను ఉదయమే కలిసి విన్నవించారు.

అందుకు ఆయన ఒప్పుకున్నారు. ఆయనకు విషయం చెప్పి వెళ్ళిపోయారు. అనంతరం ఆ గురువు ఏం చేసారో తెలుసా...తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకున్నారు. ఏదో ఒక మాటను మాటిమాటికీ చెప్పుకున్నారు. ఆ గదిలో అటూ ఇటూ పదార్లు చేసారు.

ఆయన పైకి చెప్పుకుంటున్న మాటలు గది బయట ఉన్న కొందరి చెవిన పడ్డాయి. అయితే ఆ మాటలు స్పష్టంగా లేవు. కాస్సేపు తర్వాత ఆ గురువుగారు తలుపు తెరచుకుని బయటకు వచ్చారు.

ఆయనను చూసి అక్కడున్న వారందరూ మీరు లోపల పదే పదే ఏదో చెప్పుకున్నారు... దాని అర్థమేమిటీ అని అడిగారు.

అప్పుడు ఆ గురువుగారు ఇలా చెప్పారు...

"మరేమీ కాదు... మీరు ఈ రోజు సాయంత్రం జరగబోయే సభలో నన్ను ఇంద్రుడని, చంద్రుడని ఆహా ఓహో అని పొగుడుతారు... ఆ మాటలు వింటున్నప్పుడు నాకు అహంకారం పెరిగిపోతుంది. అందువల్ల ఆ మాటలన్నీ నాకు నేనే చెప్పుకున్నాను. ఇప్పుడు ఆ మాటలన్నీ నాకిప్పుడు అలవాటైపోయాయి. ఎవరెన్ని గొప్పలు చెప్పినా నన్నేమీ చేయలేవు... ఆ మాటలేవీ బుర్రకెక్కవు" అని.

ఆయన మాటల నుంచి మనం తెలుసుకోవలసింది ఏమిటంటే... అహంకారానికి ఎట్టి పరిస్థితిలోనూ తావివ్వకుండా ఉండటం అలవాటు చేసుకోవాలి. నేను అనే ఆలోచనే రానే కూడదు. నన్నెవరూ కదల్చలేరని పదే పదే ఒకాయన చెప్పుకుంటూ ఉండేవారు. ఒరోజు ఉన్నట్టుండి ఆయన కాలు విరిగి ఆస్పత్రిపాలయ్యారు. ఏమైంది? అని అడిగారు తెలిసినవారు. నన్నెవరూ ఢీకొనలేరని చెప్పుకుంటూ రోజులు గడిపేస్తున్న ఆయన తీరా ఓ అరటిపండు తొక్కమీద కాలు వేసి జారిపడ్డాడు. ఆ కారణంగా కాలు విరిగి ఆస్పత్రిపాలయ్యాడు. ఇప్పుడా వ్యక్తి కదల్చడానికి ఎన్ని రోజులు పడుతుందో ఎవరికి తెలుసు?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458

పశ్చిమ వీధి పోటు వల్ల కలిగే నష్టాలు?

పశ్చిమ దిక్కు వరుణదేవుడు అధిష్టించిన స్థానం. నీటికి సంబంధించిన దిక్కు. వరుణ స్థానంలో ఆయుధాలు భద్రపరచవచ్చు. ఈ దిక్కు తూర్పు భాగం కంటే ఎత్తుగా ఉండాలి. నీటి ప్రవాహం పశ్చిమం నుండి తూర్పుకు/ఈశాన్యానికి ప్రవహించే విధంగా, పశ్చిమ భాగపు భూమి ఎత్తుగా ఉండాలి. వరుణ స్థానం చాలా శక్తివంతమైన స్థానం. త్రేతాయుగపు ఇతిహాసమైన 'మహాభారతం'లో పశ్చిమ భాగానికి దిక్పాలకుడైన వరుణ దేవుడి విశేష ప్రస్తావన ఉంది. మహాభారతంలోని ఒక ఘట్టంలో అగ్నిదేవుడు తన అజీర్తి వ్యాధిని పోగొట్టుకొని, స్వస్థత పొందటానికి 'ఖాండవము' అనే వనాన్ని దహించవలసి వస్తుంది. కనుక అగ్నిదేవుడు నర నారాయణులైన శ్రీకృష్ణార్జునలను అందుకు సహాయపడమని వేడుకుని, అవసరమైన అస్త్ర శస్త్ర సంపదను వారికి అందజేస్తాడు. తన మిత్రుడైన వరుణ దేవుడిని ప్రార్థించి, అతని ద్వారా పొందిన గాండీవం అనే ధనస్సును, అక్షయ తూనీరములను అర్జునుడి చేత స్వీకరింపచేస్తాడు.

అలాగే వరుణ దేవున్ని ప్రార్థించి పొందిన మరొక శక్తివంతమైన 'చక్రాయుధము'ను శ్రీకృష్ణుడి చేత స్వీకరింపచేస్తాడు. దేవతల కోసం 'దేవ శిల్పి' మయాసురుడి చేత తయారు చేయబడిన అనేకానేక మహిమాన్వితములైన ఆయుధములన్నీ వరుణుడి చేత సంరక్షింపబడుతుంటాయి. ఆయుధాలు అన్యులకెవరికీ దొరకకుండా, వరుణుడు అగాథమైన సముద్ర జలాలలో దాచిపెడుతుంటాడు. యుద్ధ సమయాలలో ఏ దేవతలకైనా ఎప్పుడైనా ఆయుధాలు అవసరమైతే, వారు స్మరించినంత మాత్రాన వరుణుడు తాను అదృశ్యంగా ఉంటూ ఆయా ఆయుధాలను దేవతలకి అందజేస్తూ ఉంటాడు. ఇది ఆయన ముఖ్యమైన కర్తవ్యం. అలా వరుణ దేవుడి ప్రాముఖ్యత ఇతిహాసాలలో వివరించారు. వరుణుడు అధిష్టించిన దిక్కుకి వరుణ స్థానమని, పశ్చిమ దిక్కు అని పేరు వచ్చింది. అలా అష్టదిక్పాలకులలో వరుణుడు 'పశ్చిమ దిక్పాలకుడు'గా పేర్కొనబడ్డాడు. నవగ్రహాలలో శనీశ్వరుడు 'పశ్చిమ దిగ్పతి'గా పేర్కొనపడ్డారు.



పశ్చిమ భాగం గురించి మరికొన్ని విషయాలు.. ఏ క్షేత్రానికైనా/స్థలానికి అయినా, ఏ ఇంటికైనా సరే పడమర భాగం నిడివి ఎంత ఉంటుందో అందులో పావుభాగపు పశ్చిమ వాయువ్యం భాగంలోకి వెళ్తుంది. మరొక పావు భాగం పశ్చిమ నైరుతిలోకి వెళ్తుంది. ఈ రెండు పావుభాగాలు పోను మధ్యలో మిగిలినటువంటి భాగం పశ్చిమంగా నిర్ధారణ కాబడుతుంది. పశ్చిమ మొత్తం భాగంలోనూ మధ్యలో వచ్చేటటువంటి పశ్చిమ భాగం ఏదైతే ఉంటుందో అది ఇంటికి/క్షేత్రానికి లేదా స్థలానికి పశ్చిమ భాగమవుతుంది. ఈ పశ్చిమ భాగం వాస్తు ప్రకారం దోషరహితంగా ఉన్నప్పుడు శక్తివంతమైనటువంటి ప్రభావాలు ఆ ఇంట్లో ఉండే వాళ్లకి అను కూలంగా పనిచేస్తూ ఉంటాయి. ఈ పడమర భాగం ఎప్పుడైతే వాస్తు వక్రతను కలిగి దోషపూరితమవుతాయో, అప్పుడు ఆ ఇంట్లో నివసించే వాళ్లకి వీటి అనుకూల ప్రభావం స్థాయి తగ్గిపోతుంది. వాస్తు ప్రకారం పశ్చిమ భాగంలో దోషం ఏర్పడటానికి ఉన్న కొన్ని కారణాలలో ఒకటి వీధి పోటు. పశ్చిమ భాగంలో వీధి పోటు కలిగినప్పుడు కలిగే అనేక ప్రతికూల ఫలితాలలో ముఖ్యమైనవి: పనులలో ఆటంకం కలగటం, విజయావకాశాలు తగ్గటం. సాధారణ శ్రమ తీసుకొని మంచి ఫలితాలను పొందగలిగే అవకాశం ఉన్నచోట కూడా, పనులు జరగకపోవడం గమనించవచ్చు. సాధారణ పరిస్థితిలో మనం కొంత శ్రమపడి ఒక పని పూర్తి చేసి ఒక ఫలితాన్ని కొంతవరకు లేదా, పూర్తిగా పొందుతూ ఉంటాం. కానీ పశ్చిమ వీధి పోట్లు ఉన్నప్పుడు ఎంత కష్టపడినా మామూలు పనులు కూడా పూర్తి అవటం చాలా కష్టతరం అవుతూ ఉంటుంది.

ఒక మామూలు ఇంట్లో ఉండి పనిచేస్తూ ఎంతో కొంత మంచి ఫలితాలను పొందేవాళ్ళు, పశ్చిమ వీధిపోటు ఉన్న ఇంట్లోకి మారినప్పటి నుండి పనులు జరగకపోవటం అన్న విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు.

ఏదైనా ఒక గృహాన్ని మనం ఊహించుకున్నప్పుడు తూర్పు ముఖ ద్వార ఇంటినే ఊహించుకుంటాం. ఇంటికి వెనకవైపు వచ్చేది పడమర. పడమర వీధి పోటు ఉన్నప్పుడు ఆ ఇంట్లో నివసించే వాళ్లకి సాధారణంగా వెన్నుపోటు (back stabbing) అన్నది అనుభవంలోకి వస్తుంది. వాళ్లకు బాగా తెలిసినవాళ్లు లేదా స్నేహితుల్లో/బంధువుల్లో కానీ ఉన్నవాళ్లే వాళ్లకి తెలియకుండా నమ్మకద్రోహం చేయటం, వెన్నుపోటు పొడవటం లాంటి సంఘటనలు అనుభవంలోకి వస్తూ ఉంటాయి. ఇలా రెండు మూడు సార్లు నష్టపోయేసరికి జీవితంలో కోలుకోలేనంత దెబ్బ తగులుతుంది. మళ్లీ కోలుకొని మామూలు స్థితికి రావటం చాలా కష్టమవుతుంది. కొన్ని సందర్భాలలో అసలు కోలుకోవటం అనేది జరగకపోవచ్చు. అందుకని ఒక ఇంట్లోకి కిరాయికి వెళ్లేటప్పుడు అయినా సరే, కొనేటప్పుడైనా సరే... వాస్తు విషయంలో జాగ్రత్త పడాలి అనుకుంటే... ఈ పశ్చిమ వీధిపోటు ఉన్నప్పుడు అందులోకి కిరాయికి దిగటంగానీ ఆ ఇంటిని కొనటం కానీ చేయకపోవటమే మంచిది. ఇట్లాంటి ఇంట్లోకి వచ్చి, అక్కడ ఉండి అనేక కష్టాలు పడి, నష్టాలు పొంది ఆ తర్వాత వాటి నుంచి బయట పడటానికి ప్రయత్నిస్తూ ఉండటం కంటే– ఇటువంటి వీధి పోట్లు ఉన్న ఇళ్లల్లోకి మొదట్లోనే అద్దెకు దిగకపోవటం, ఆ ఆస్తిని కొనకపోవటం అన్ని విధాలా మంచిది. తప్పనిసరిగా అటువంటి ఇళ్లల్లో ఉండవలసి వస్తే, వీధి పోటును నివారించే యంత్ర పద్ధతులు, ప్రత్యామ్నాయాలు ఉంటాయి. వాటిని ఉపయోగించటం వలన కొంత వరకు మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది.

సూర్యకళ శక్తి స్థానం

మహాపాశుపత బంధ క్షేత్రాలలో మూడవది శ్రీ అగస్త్రీశ్వర స్వామి కొలువైన ఈమని గ్రామం నందివెలుగు నుండి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

శ్రీ అగస్త్యేశ్వర స్వామి కొలువైన ఈ క్షేత్రం మహాపాశుపత బంధ ఆయుధాలకు సూర్య శక్తిని అందించిందని ఈ క్షేత్ర గాథ. పచ్చని పొలాల మధ్య ఉన్న ఊరి మధ్యలో చక్కని ప్రశాంత పల్లె వాతావరణంలో నెలకొని ఉంటుంది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. సుమారు ఇరవై కిలోమీటర్ల పరిధిలో ముప్పై దాకా పురాతన శివకేశవ ఆలయాలు కనపడతాయి. ఇవన్నీ కూడా వెయ్యి సంవత్సరాలకు పూర్వం నిర్మించినట్లుగా శాసనాధారాల వల్ల తెలుస్తోంది. వాటిలో కొన్ని కాలక్రమంలో మార్పులూ, చేర్పులతో కొత్తరూపును సంతరించుకొన్నాయి. దీని వెనుక గ్రామస్థుల కృషి, వారి భక్తిభావాలే ప్రధాన కారణమని అర్థం అవుతుంది. తొలినాళ్ల నుండి పావన జీవనదీ తీరాలు అనేక దివ్యధామాలకు నెలవుగా ప్రసిద్ధికెక్కాయి. శ్రీ మహావిష్ణువు పాదాల నుండి ఉద్భవించిన కృష్ణవేణీ తీరాలు కూడా లెక్కలేనన్ని దేవాలయాలకు ప్రసిద్ధి. స్కాంధ పురాణంలోని కృష్ణవేణి మహాత్యం అధ్యాయంలో ఈ క్షేత్రాల గురించి చెప్పబడి ఉన్నట్లుగా చెబుతారు. మహా పాశుపత బంధ ఆలయాలలో మూడవది అయిన ఈమనిలో ఎదురు బొదురుగా శివాలయం, శ్రీ రామాలయం ఉంటాయి. శ్రీ గంగా స్వయంవర పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయం పశ్చిమ దిశగాను, శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ రామచంద్ర మూర్తి ఆలయం తూర్పు దిశగాను నిర్మించబడ్డాయి.

విశాల ప్రాంగణానికి పెద్ద స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. అక్కడ ధ్యాన ముద్రలో ఉన్న మహేశ్వరుని విగ్రహంతో బాటు శ్రీ కుమార స్వామి, శ్రీ ధర్మ శాస్త్ర మూర్తులను కూడా ఏర్పాటు చేశారు. ఇవి నూతన నిర్మాణాలు.

మూడంతస్థుల రాజ గోపురానికి వెలుపల ద్వారానికి రెండు పక్కలా నందీశ్వరుడు భక్తులను స్వాగతిస్తుంటారు. ఇక్కడే చిన్న సన్నిధిలో శ్రీ వినాయకుడు దర్శనమిస్తారు. పక్కనే నాగ ప్రతిష్టలు సైతం కనిపిస్తాయి. గతంలో ఈ క్షేత్రాలన్నీ సర్పదోషాన్ని తొలగించే దివ్యమైన పరిహార స్థలాలు. రాజగోపురం నుండి ప్రాంగణం లోనికి అడుగు పెడితే ఎత్తైన ధ్వజస్థంభం, బలిపీఠాలు, పురాతన శాసనాలు కనిపిస్తాయి. మరో విశేషం ఏమిటంటే ఇది సూర్య కళ శక్తి స్థలం అని చెప్పడానికి ధ్వజస్థంభం వద్ద శ్రీ సూర్యనారాయణ స్వామి సన్నిధి ఉంటుంది. మరే శివాలయంలోనూ గర్భాలయానికి ఎదురుగా ధ్వజస్థంభం వద్ద ఆదిత్యుడు కొలువై దర్శనమివ్వరు.

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

ప్రాంగణంలో అష్టాదశ పీఠ పాలికల, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల అధిపతి రూపాలను సుందరంగా మలచి ఉంచారు. ఆలయ విమాన గోపురం పైన అరుదైన శివావతారమైన "శ్రీ శరభేశ్వరుడు" దర్శనమిస్తారు. ఈయన హిరణ్యకశ్యపుని సంహరించిన తరువాత కూడా శాంతించని శ్రీ ఉగ్ర నారసింహుని అదుపు చేసి ఆవేశాన్ని తగ్గేలా చేశారని శివ గాథలలో ఉన్నట్లు చెబుతారు.

ధ్వజస్థంభం వద్ద ఒక నందీశ్వరుడు ఉపస్థితులై ఉంటారు. నందీశ్వరునికి నమస్కరించుకుని లోపలికి వెళితే ఆస్థాన మండపంలో మరొక నందీశ్వరుడు ఏకాగ్రచిత్తంతో గర్భాలయం వైపుకు తదేక దృష్టితో చూస్తూ దర్శనమిస్తారు.

ఆస్థాన మండపానికి అనుసంధానంగా మూడు సన్నిధులు దర్శనమిస్తాయి. ఒకదానిలో శ్రీ లింగరాజు ఎత్తైన పానవట్టం మీద చిన్న లింగరూపంలో కొలువై ఉంటారు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ లింగం ఇక్కడి పొలాలలో లభించిందట. మరో సన్నిధిలో శ్రీ పార్వతీ అమ్మవారు ఉత్తరాముఖిగా సుందర నేత్రపర్వమైన అలంకరణలో దర్శనమిస్తారు. అమ్మవారు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి.

గర్భాలయంలో శ్వేతవర్ణ లింగ రూపంలో శ్రీ అగస్త్యేశ్వర స్వామి చిన్న మండపంలో నయనానందకరంగా కనిపిస్తారు. లింగం మీద గీతాలు, పగుళ్ల మాదిరి కనిపించే వాటిని స్వామి కిరాతక వేషంలో అర్జునునితో పోరాడినప్పుడు ఏర్పడిన గాయాల తాలూకు గుర్తులని చెబుతారు.

భక్తుల మనోభీష్టాలను నెరవేర్చేవానిగా శ్రీ అగస్త్యేశ్వర స్వామి ప్రసిద్ధి. నియమంగా నిర్ణయించిన అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు ప్రతి నిత్యం జరుగుతాయి. శ్రీ గణపతి నవరాత్రులు, శ్రీ దుర్గా నవరాత్రులు, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రావణ, కార్తిక మాస పూజలు విశేషంగా నిర్వహిస్తారు. హిందూ పర్వదినాలలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

మహా శివరాత్రినాడు చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుండి కూడా భక్తులు శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి దర్శనానికి, మహా శివరాత్రి ఉత్సవాలలో పాల్గొని తరించాలని వస్తుంటారు.

శ్రీ రఘునాథ స్వామి ఆలయం

శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా తూర్పు ముఖంగా ఉండే శ్రీ రఘునాథ స్వామి ఆలయం సుమారు నాలుగు వందల సంవత్సరాల కిందట నిర్మించినట్లుగా తెలుస్తోంది.

గతంలో శ్రీ లక్ష్మణ స్వామి లేరట. కొన్ని సంవత్సరాల క్రితం ఒక భక్తునికి స్వప్నంలో స్వామి కనపడి సమీప గ్రామం మున్నంగిలో ఒక బావిలో ఉన్నట్లు తెలిపారట. వెళ్లి చూడగా విగ్రహం లభించింది. గ్రామస్థులు, ప్రాంత జమీందారు ఆనందంతో స్వామి వారిని గర్భాలయంలో ప్రతిష్టించారట. నాటి నుండి శ్రీ రామాలయంగా పిలవబడుతోంది. ప్రధాన రహదారి మీద ఉన్న ఈ ఆలయానికి స్వాగత ద్వారం ఉంటుంది. ఆలయ ప్రాంగణంలోకి వెళ్ళడానికి చిన్న రాజగోపురం, ఇరుపక్కలా అంజనాసుతుడు, వినతా తనయుడు అంజలి ఘటిస్తున్న భంగిమలో కనపడతారు. ఎదురుగా ఎత్తైన ధ్వజస్తంభం, బలిపీఠాలు, శ్రీ ఆంజనేయ సన్నిధి కనపడతాయి. ఆలయంలోని అన్ని నిర్మాణాలు చక్కని వర్ణాలతో తీర్చిదిద్దారు, దాంతో ఎంతో సుందరంగా కనిపిస్తాయి, దక్షిణ ద్వారం వద్ద దశావతార మూర్తులను ఉంచారు. ప్రధాన ఆలయ వెలుపలి గోడల పైన పురాణ ఘట్టాలను చెక్కారు. ముఖమండపానికి అనుబంధంగా మూడు సన్నిధులు కనపడతాయి.

శ్రీ వేణుగోపాల స్వామి దక్షిణ ముఖంగా కొలువై ఉంటారు. స్వామివారికి ఎదురుగా వెలుపల శ్రీ దాసాంజనేయ స్వామి వారి సన్నిధి ఉంది. ఈ రెండు విగ్రహాలు చుట్టుపక్కల పొలాలలో లభించాయట. ఇది ఈ ప్రాంతంలో గతంలో మరికొన్ని ఆలయాలు ఉండేవన్న విషయాన్ని తెలుపుతోంది. మండపంలో గాయక భక్తులు, నిరంతరం శ్రీహరి నామస్మరణ, ఆయన గుణగణాల కీర్తనా గానం చేసిన పన్నిద్దరు ఆళ్వార్ల సన్నిధి ఉంటుంది.

గర్భాలయంలో కొద్దిగా ఎత్తైన పీఠం మీద శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామి నయన మనోహరమైన అలంకరణలో భక్తులకు ఆనందానుభూతులను ప్రసాదిస్తారు.

ఉగాది, శ్రీరామ నవమి, శ్రీ కృష్ణాష్టమి, శ్రీ హనుమజ్జయంతి, ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తారు.

ఆలయం వేళలు

ఈ రెండు ఆలయాలు ఉదయం ఆరు గంటల నుండి పదకొండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు గంటల నుండి రాత్రి ఏడు వరకు వరకు తెరిచి ఉంటాయి.

ఎలా వెళ్లాలి?

విజయవాడ, గుంటూరు, మంగళ గిరి, తెనాలి నుండి సులభంగా ఈమని చేరుకోవచ్చు. అయితే స్థానికంగా వసతి సౌకర్యాలు లభించవు. ■

ఒక విషయం గురించి తెలిసినా, తెలియకపోయినా ఫ్రెంచి పౌరుడు ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాడు; ఆంగ్లేయుడు తనకు తెలియని విషయాన్ని గురించి మౌనం వహించడమే మంచిదని భావిస్తాడు. – శామ్యూల్ జాన్సన్

(23వ పేజీ తరువాయి)

ఏదీ..! తెలుగు?

ఆంధ్రభాషావర్ధినీ సభను స్థాపించి, దక్షిణా పథంలో తెలుగువాళ్ళను తెలుగులోనే మాట్లాడాలని, తెలుగులోనే రాయాలని పెద్ద ఎత్తున తెలుగు భాషోద్యమం ప్రారంభించారు. తిరునల్వేలి కేంద్రంగా తెలుగును బతికించడానికి, భాషా పరిరక్షణకు సర్వస్వం త్యాగం చేసిన తెలుగు భాషాభిమాని, ప్రేమికుడు సాధు వారదరాజం పంతులు, తెలుగువారికి తల్లిభాషగా తెలుగును బోధించే సౌకర్యాలు లేకపోవడంతో ఇంటి దగ్గరే 1923లో తెలుగు తరగతులు నిర్వహించేవారు.. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెలుగును పరిరక్షించుకోవాలనే జిజ్ఞాసతో 1924 నవంబరు 16న దక్షిణ ఆంధ్రభాషాభివృద్ధి సభ స్థాపించారు. దక్షిణ తమిళనాడులో తెలుగువారు, ఇంట్లో తల్లిభాష తెలుగులోనే మాట్లాడాలని, బడులలో, కళాశాలలలో తెలుగు విద్యార్థులను గుర్తించి తల్లిభాష నేర్చుకొనేవారికి ప్రోత్సాహం అందించేవారు. ఉత్తరాలలో 'మేము కులాస! మీరు ఎలాగున్నారు?' తెలుగును తమిళ లిపిలో రాయాలని సూచించేవారు. దీనిని దక్షిణ లిపి అని పేరు పెట్టారు. పెద్ద బాలశిక్షలోని విషయాలు, చిన్న తెలుగు నాటికలు, పాటలు పాడి ప్రజలను ఉత్సాహపరిచేవారు. 'మనం తెలుగువాళ్లుగా పుట్టిన కారణంగా తల్లిభాషను మరవద్దు. దానిని మనం కాపాడాలి' 'తల్లిభాష తెలుగును కాపాడుము' వంటి నినాదాలు పటాలపై రాసి ఊరూర తిరిగేవారు.

ఆంధ్రరాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం తిరునల్వేలి వచ్చినపుడు, 'తెలుగు కుటుంబాలు, వంశాలు ఆ గట్టున కొందరు, ఈ గట్టున కొందరు ఉండిపోయారు.

ఈ ప్రాంత తెలుగువారి కోసం మీరు ఏమి చేస్తున్నారయ్యా?' అని ప్రశ్నించారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా మాతృభాషకు నిస్వార్థంగా ప్రేమించి సేవలందించి 1972 ఫిబ్రవరి 27న కన్నుమూసారు. సాధు వారదరాజంలా ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు ఉంటే చాలు తల్లిభాష బతుకుతుంది. ●

అరుదైన జంతువు

షేక్ అబ్దుల్ హకీం జాని

ప్రపంచవ్యాప్తంగా అరుదుగా కనిపించే ఖరీదైన క్షీరదం పాంగోలిన్, దీన్ని కొన్ని ప్రాంతాలలో సంగోలిన్ అని కూడా పిలుస్తారు. తెలుగులో అలుగు, తెలుగు, సల్లూ పాము అని, హిందీలో వజ్రషాల్క్ అని అంటారు. చిప్పల సంది, నాలుగు ఇత్యాది పేర్లతో కూడా దీన్ని పిలుస్తారు. చీమల్ని, క్రిమికీటకాల్ని, చెద పురుగుల్ని తింటూ జీవించే జంతువు సాంగొలిన్. ఇది యేడాదికి కొన్ని మిలియన్ల వరకు క్రిమి కీటకాలను తినగలదు. వీటిలో మొత్తం 8 జాతులున్నాయి. నాలుగు జాతులు ఆసియాలోను, నాలుగు జాతులు ఆఫ్రికాలో ఉన్నాయి. ఆసియాలో కనిపించే నాలుగు జాతుల్లో మన దేశంలో రెండు జాతుల సాంగొలిన్లు కనిపిస్తుంటాయి.

గడ్డి మైదానాలు, రాతి, ఇసుక నేలలు, సవన్నా గడ్డి భూముల్లో ఇవి కనిపిస్తుంటాయి. అడవికి రాజుగా ప్రసిద్ధి చెందిన సింహం దాదాపు ఏ జంతువునైనా వేటాడి తినగలదని ప్రతీతి. కానీ పాంగోలిన్ వీపుపై ఉండే పెంకులు కత్తిలా పదునుగా ఉండి సింహం సైతం నమలలేనంత గట్టిగా ఉంటాయి. పాంగోలిన్ల మూతి ముంగీసను పోలి ఉంటుంది. నాలుగు కాళ్ళు కలిగిన పాంగోలిన్ 20 సంవత్సరాల పాటు జీవిస్తుంది. పాంగోలిన్ దాదాపు 3.2 అడుగుల పొడవు, 10 పౌండ్ల బరువును కలిగి ఉంటుంది. మగ పాంగోలిన్ అధిక బరువును కలిగి ఉంటుంది. వీటి కాళ్ళకున్న గోళ్ళు పదునుగా ఉంటాయి. అందువల్ల గోతులు తీసి ఆహారాన్ని వెతుక్కోగలవు.

తోక సాయంతో ఒక కొమ్మ నుండి మరో కొమ్మ మీదకు దూకగలవు. 6 అంగుళాల జిగురుతో కూడిన అతి పొడవైన నాలుకతో క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకోగలదు. ఆ సమయంలో చీమలు, క్రిమి కీటకాలు ముక్కు చెవులలో దూరకుండా మూసుకుంటుంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం పాంగోలిన్లు లక్షలాది సంవత్సరాలుగా ఎక్కువగా చీమల్ని, పురుగుల్ని, చెద పురుగుల్ని తింటూ. జీవిస్తున్నాయి. 1921లో ఈ జంతువుల సంచారాన్ని గుర్తించినట్లు వైల్డ్ లైఫ్ అధికారులు చెబుతుంటారు. పాంగోలిన్ గర్భధారణ అనేది జాతులను బట్టి విభిన్నంగా ఉంటాయి. సుమారు 70 నుండి 140 రోజుల వరకు గర్భధారణ సమయం ఉంటుంది. సాధారణంగా ఆఫ్రికన్ పాంగోలిన్ ఒకే సంతానానికి జన్మనిస్తుంది. ఆసియా జాతులు ఒకటి నుండి మూడు వరకు సంతానానికి జన్మనిస్తాయి. తల్లి పాంగోలిన్ తన సంతానానికి పాలిచ్చి పెంచుతుంది. పాము, బల్లిలా కనిపించే ఈ జీవి క్షీరదాల వర్గంలోకి వస్తుంది. నాలుగు కాళ్ళతో ఇది సంచరిస్తుంది. పిల్లల్ని కోతుల మాదిరిగా తమ వీపుపై ఎక్కించుకుని తిప్పుతూ పోషిస్తాయి. ఇవి చెట్ల తొర్రలు, నేల బొరియల్లో దాక్కొని రాత్రి వేళలో బయటకు వస్తుంటాయి.

ముదురు గోధుమ లేదా పసుపుగోధుమ రంగు పాంగోలిన్ అరుదైన జాతుల ఎముకలు, మాంసంతో ఉబ్బసం నుంచి కేన్సర్ వరకు అనేక వ్యాధులకు మందులను తయారు చేయడానికి ఉపయోగిస్తున్నారు. వీటిని చైనాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సెక్స్ కోరికలు పెంచే డ్రగ్స్ తయారీలోనూ వాడుతున్నట్లు చర్చ జరుగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ జంతువులు మనపై దాడి చెయ్యవు. మానవులకు హాని చెయ్యవు. కానీ ఇవి వేటగాళ్లకు సులభంగా దొరికిపోతాయి. వీటికి ప్రమాదం అనిపించినప్పుడు, తమ శరీరాన్ని బంతిలా తిప్పుకుంటాయి. పై ఆకారం మొత్తం చిప్పలే ఉండటం వల్ల శత్రు జంతువులు దీన్ని తినలేవు. కానీ బంతిలా చుట్టుకోగానే వేటగాళ్ల పట్టుకుపోతున్నారు. ప్రపంచంలో అరుదైన జీవుల్లో ఇదీ ఒకటి మనుషులంటే ఎంతో భయం. దీని నోట్లో పళ్ల ఉండవు, మనుషుల్ని కరవలేదు, ఎటువంటి హానీ చేయదు. చీమల్ని తింటూ బతుకుతుంది. అలాంటి ఈ జీవిని వెంటాడి, వేటాడి చంపేస్తున్నారు.

అంతరించబోతున్న జాబితాలో పాంగోలిన్లు

పాంగోలిన్ కరిచే జంతువు కాదు. మానవుడికి ఎటువంటి హాని చేయనప్పటికీ దీన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలని మనుషులే వీటికి హాని చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పాంగోలిన్ చాలా ధర పలుకుతుంది. ఆ కారణంగా వేటగాళ్ళు. స్వగర్లు అడవుల్లో వలపన్ని మరీ పట్టుకుంటున్నారు. ఇవి ప్రతిఘటించే జంతువులు కాకపోవడం వల్ల వేటగాళ్ళు సులభంగా వేటాడుతుంటారు. దీని ఒంటిపై ఉన్న పొలుసులతో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, కొన్ని రకాల ఆభరణాల తయారీకి ఉపయోగిస్తారని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌వారు చెబుతున్నారు. వీటిని విక్రయించేందుకు సాంఘిక మాధ్యమాలను వేదికగా వినియోగిస్తున్నారంటే వాటికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్లో పాంగోలినకు చాలా ధర పలుకుతుంది. ఆ కారణంగా వేటగాళ్లు, అడవుల్లో వలపన్ని మరీ పట్టుకుంటున్నారు.

పాంగోలిన్ల అక్రమ రవాణా

చీమల్ని తింటూ జీవించే పాంగోలిన్ జాతి నేడు ప్రమాదంలో ఉంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ వారి సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వన్యప్రాణుల అక్రమ రవాణాలో 20 శాతం పొంగొలిన్లే ఉన్నాయి. మాయదారి కేటుగాళ్లు పాంగోలిన్ వంటి వన్యప్రాణులను కూడా వదిలిపెట్టడం లేదు. వాటిని స్మగ్లింగ్ చేసి కాసులు దండుకోవాలని ఆరాటపడుతున్నారు. అరుదైన జీవుల్ని వేటాడి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ కారణంగా పొంగోలిన్‌లు అంతరించబోతున్న జాబితాలో చేరాయి. ప్రపంచంలోనే అత్యధికంగా అక్రమంగా రవాణా అయ్యే జంతువు వంగొలిన్.

ప్రపంచవ్యాప్తంగా 2000–2010 మధ్య దాదాపు తొమ్మిది లక్షల పాంగోలిన్లను అక్రమంగా రవాణా చేశారని ది ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ తెలిపింది. ఆగ్నేయాసియా దేశం వియత్నాంలోని ఒక గ్రామంలో ఓ పొంగొలిన్ను, దాని బిడ్డను స్థానికులు చంపడం చూసిన ఒక వ్యక్తి వాటి సంరక్షణకు తన జీవితాన్ని అంకితం చేశారు. వియత్నాంకు చెందిన ఆయన ఇప్పటివరకు 1,500 సాంగోలిన్లను కాపాడారు.

ప్రపంచంలో అత్యధికంగా అక్రమ రవాణా అవుతున్న వాటిలో ఇదొకటి. ఈ స్మగ్లింగ్కు కారణం చైనా, వియత్నాం అనే వాదన ఉంది. అక్కడ ఈ జంతువు చర్మం, మాంసంతో సంప్రదాయ మందులు తయారుచేస్తున్నారు. దీని పొలుసులలో ఉండే ఔషధ గుణాలు ఆస్తమా, క్యాన్సర్ వంటి వ్యాధులు నయం చేయడానికి తోడ్పడతాయని చైనా, వియత్నాం ప్రజలు విశ్వసిస్తారు. దశాబ్దాలుగా ఇది ప్రపంచంలోని అన్ని దేశాల నుంచీ అక్రమంగా రవాణా అవుతోంది. దీనితో చేసే మందులను

ధనవంతులు అధిక ధరకు కొంటున్నారు. ఇది ఖరీదైనది కావడంతో అంతర్జాతీయ మార్కెట్లో పెద్ద ఎత్తున స్మగ్లింగ్ చేస్తున్నారు. దేశాన్ని, ప్రాంతాన్ని బట్టి పాంగోలిన్ ధర మారుతుంటుంది. కొన్ని చోట్ల వేలు పలికితే, మరికొన్నిచోట్ల లక్షల్లో దీని ధర ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పాంగోలిన్ ధర లక్షల్లో ఉంటుంది. దీని మాంసం కూడా అధిక ధర పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో పాంగోలిన్ చాలా ధర చాలా హెచ్చుగా ఉంటుంది. ఆ కారణంగా వేటగాళ్ళు, స్మగ్లర్లు అడవుల్లో వలపన్ని మరీ పట్టుకుంటున్నారు.

వేటాడితే కఠిన శిక్షలు

మన ప్రాంతాలలో కూడా పాంగోలిన్లు కనిపిస్తుంటాయి. పాంగోలిన్‌లను వేటాడి చంపుతున్న స్మగ్లర్లపై కేసులు పెట్టి వాటిని పరిరించడానికి చాలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వీటిని వేటాడితే ఏడేళ్ళ జైలుశిక్ష రూ.5 లక్షల జరిమానా కూడా విధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. పాపికొండలలో ఒక సందర్భంలో పాంగోలిన్ వేటగాళ్ళపై కేసులు పెట్టారు. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతంతో పాటు నాగార్జునసాగర్, ఆత్మకూరు, మార్కాపురం ఇత్యాది ప్రాంతాలలో ఏర్పాటు చేసిన. సి.సి. కెమెరాల్లో అలుగు జంతువు కనిపించింది.

మన ప్రాంతంలో కనిపించే అలుగును ఇండియన్ ప్రాంగొలిన్ అని పిలుస్తారు. దీన్ని మానిస్ క్రాసికాడాటా జాతికి చెందినదిగా పరిశీలకులు చెబుతుంటారు. ఇవి మన నల్లమల అడవుల్లో కనిపించిన సందర్భాలు ఉన్నాయి. దక్షిణాదిలోని తమిళనాడు, ఉత్తరాదిలోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్లో వీటి అక్రమ రవాణా అధికంగా ఉంది. ప్రపంచంలో ఎక్కువగా స్మగ్లింగ్ చేస్తున్న జంతువుల్లో పై స్థాయిలో ఉండేది పాంగోలిన్, ఆఫ్రికా, ఆసియాలో ఎక్కువగా ఈ జంతువును స్మగ్లింగ్ చేస్తుంటారు. ఇటీవల సింగపూర్లో స్మగ్లింగ్ చేస్తున్న 14 టన్నుల పాంగోలిన్ పొలుసుల్ని పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.270 కోట్లు.

ఏడాదికి దేశాలు దాటే పాంగోలిన్ల సంఖ్య 10 వేల వరకు ఉంటుందని అంచనా. ఏటా ప్రపంచవ్యాప్తంగా 67. వేల పాంగోలిన్లను చంపుతున్నారని అంచనా. వాటిని సంరక్షించాలని అంతర్జాతీయంగా ఒప్పందం కూడా ఉంది. పాంగోలిన్ జంతువుల్ని చంపొద్దంటూ జాకీచాన్ లాంటివాళ్ల ప్రచారం చేస్తుండటం విశేషం. అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉన్న పాంగోలిన్లను కాపాడుకోవడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు వన్య ప్రాణి సంరక్షణ చట్టం క్రింద తమ వంతు కృషి చేస్తున్నాయి. ■

పుస్తకాలు దీపాల వంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తాయి.

– అంబేద్కర్

ఫిబ్రవరి 2, 2025 నుండి ఫిబ్రవరి 8, 2025 వరకు

వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

మేషం

ఈ వారం కొత్త వ్యాపారాలను ప్రారంభించాలన్న ఆలోచనలు అంతంత మాత్రంగా ఉంటాయి. అన్ని సమకూరినప్పటికీ ఏదో వెలితిగా తోస్తుంది భయం గుప్పిట్లో పెట్టుకొని ప్రారంభిస్తారు. చిన్న చిన్న తాత్కాలిక వ్యాపారస్తులకు కాలం అనుకూలంగా ఉంటుంది. నూతన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. సర్వరక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నాన మాచరించండి. వ్యాపార కేంద్రాలలో జనాలు రాకపోకలు పల్చబడటం ఆలోచింప జేస్తుంది.

వృషభం

ఈ వారం నూతన గృహోపకరణాలను నూతన గృహానికి సంబంధించిన ఆలోచనలు కలిగి ఉంటారు. జీవిత ఆశయంనీ నెరవేర్చుకోవడానికి ఎంతగానో శ్రమిస్తారు. సంతానం నుండి సహాయ సహకారాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. సౌర కంకణాన్ని ధరించండి. మొదలుపెట్టిన కార్యక్రమంలో కొంతమంది చేతులు పడగానే అవి వెనక్కి వెళ్లిపోవడం ఆశ్చర్యం కలిగించే అంశంగా మారుతుంది. ప్రశంసలు అందుకుంటారు.

మిథునం

ఈ వారం మానసిక ధైర్యాన్ని సంతోషాన్ని కలిగి ఉంటారు. ఆధ్యాత్మిక కేంద్రాలు పట్ల ఆకర్షితులవుతారు. గురువుల పరిచయాలు ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి. పుణ్యక్షేత్రాలను సందర్శించా లన్న ఆలోచనలు కలిగి ఉంటారు ఒకానొక సందర్భంలో ఒక శుభ ఆహ్వానాన్ని అందుకుంటారు ఎంతోమందిని ముఖ్యమైన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

కర్కాటకం

ఈ వారం కొంతమంది ద్వారా ప్రేమ సమాచారాన్ని అందుకుంటారు. కొన్ని విషయాలలో తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా జాగ్రత్త వహిస్తారు. స్నేహితుల ద్వారా కొన్ని రాయబారాలు నడిపే ప్రయత్నాలు విరమించుకుంటారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. ఇంట్లో కొంతమందికి ఆరోగ్యం సహకరించక ఉద్యోగం చేయలేని స్థితికి చేరటం మీరు కచ్చితంగా కొన్ని బాధ్యతలు స్వీకరించే విధంగా ఉంటుంది.

సింహం

ఈ వారం కార్యాలయంలో రహస్య సమాచారాన్ని అందుకుంటారు. కొన్ని ప్రాజెక్టు నిమిత్తం మీ ఆలోచనలు మీ ప్రవర్తన మారుతుంది. నూతన కార్యక్రమాల పట్ల మంచి అవగాహన కలిగి ఉంటారు. సంఘ సేవ కార్యక్రమంలో, దైవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. నేత్ర సంబంధమైన వ్యాధులు కలగవచ్చు అప్రమత్తంగా ఉండండి.

కన్య

ఈ వారం నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసొస్తాయి. బ్యాంకు ఉద్యోగస్తులకు ఒత్తిడి మరింత పెరుగుతుంది. పనిచేయలేని విధంగా పరిస్థితులు గోచరిస్తాయి కాలక్రమమైన కొన్ని అంశాల పట్ల మంచి అవగాహన కలిగి ఉంటారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. మీ వారి పేరు మీద మీరు తీసుకునే నిర్ణయాలు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు.

తుల

ఈ వారం కార్యాలయంలో రహస్య సమాచారాన్ని అందుకుంటారు. కొన్ని ప్రాజెక్టు నిమిత్తం మీ ఆలోచనలు మీ ప్రవర్తన మారుతుంది. నూతన కార్యక్రమాల పట్ల మంచి అవగాహన కలిగి ఉంటారు. సంఘ సేవ కార్యక్రమంలో, దైవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. మీ వారితో కలిసి కొన్ని నూతన ప్రయత్నాలకు శ్రీకారం చుడతారు. నేత్ర సంబంధమైన వ్యాధులు కలగవచ్చు అప్రమత్తంగా ఉండండి.

వృశ్చికం

ఈ వారం పుస్తక పఠనం మిమ్మల్ని ఆకర్షిస్తుంది. చేయాలనుకున్న కార్యక్రమాలు సక్రమంగా చేయగలుగుతారు. ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న కొన్ని అంశాల పట్ల శుభవార్తను వినగలుగుతారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. ఇంట్లో జరగబోయే శుభకార్యాలకు సంబంధించిన ఆలోచనలు మీలో ఉత్సాహాన్ని నెలకొల్పుతాయి. పెట్టిన పెట్టుబడులు యధాతథంగా తిరిగి రావడం మీ మానసిక ధైర్యానికి సంతోషానికి కారణం అవుతుంది.

ధనస్సు

ఈ వారం నూతన గృహ నిర్మాణ ఆలోచన అంతంతమాత్రంగా ఉంటాయి. అడ్వాన్స్ ఇచ్చి వెనుతిరిగే అవకాశం ఉంది. క్రీడా రంగంలో ఉన్న వారికి కాలం అనుకూలంగా ఉంటుంది. మంచి విజయాలను నమోదు చేసుకోగలుగుతారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. దూర ప్రయాణాలు తరచుగా ఏర్పడతాయి. వాహన సంబంధమైన అసౌకర్యం కలుగుతుంది. సొంత వాహనం ఉంటే బాగుంటుంది అన్ని ఆలోచనలు జరుపుతారు.

మకరం

ఈ వారం కొన్ని కార్యక్రమాలలో మీరు వేసిన అంచనాలు నిజమవడం మానసిక ధైర్యానికి కారణం అవుతుంది. పలువురిలో ప్రశంసలను గౌరవం మర్యాదలు అందుకో గలుగుతారు. ఎన్నో విషయాల పట్ల అవగాహన కలిగి ఉంటారు. నవగ్రహాల దగ్గర నవగ్రహ వత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి. సోషల్ మీడియా ఫ్లాట్ ఫారం ద్వారా వ్యాపారాన్ని పెంచుకోవాలని చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మీరు పడుతున్న కష్టం శ్రమ చూసి పరాయి వాళ్ళకు బాధ కలుగుతుంది కాని మీ వాళ్లకు మాత్రం ఏ మాత్రం పట్టదు.

కుంభం

ఈ వారం జీవిత భాగస్వామి అలవాట్లకు బానిస అవ్వడం ఏమాత్రం సహించరు. పిల్లల పట్ల శ్రద్ధ లేదు కుటుంబం పట్ల శ్రద్ధ లేదని మీరు ఎంత వాపోయిన వినిపించుకోని పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. పెద్దల సమక్షంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి మీరు నిర్ణయించుకుంటారు. చిన్న చిన్న వ్యాపారస్తులకు తాత్కాలిక వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. క్రీడా రంగంలో ఉన్న వారికి మంచి అవకాశాలు అందుకో గలుగుతారు.

మీనం

ఈ వారం మెడికల్ రిప్రజెంటివ్ కి పనులు మరింత పెరుగుతాయి. ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ అనుకున్న టార్గెట్ రీచ్ కాలేకపోతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు ఏర్పడతాయి. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కొత్త ఉద్యోగస్తులతో పరిచయం పెంచుకుంటారు. దూర ప్రాంతంలో ఉన్న వారితో ఫోన్ ద్వారా సంభాషణ సాగిస్తారు. కొన్ని కార్యక్రమాలలో పురోగతిని తీసుకురాగలుగుతారు.


ఒరేయ్.. మీ దుంపతెగ.. నేను మెనాలిసాను
కాదురా.. బేగంబజార్ ప్రల్లమ్మను..!!


సెటిల్మెంట్లు చేసేది నేనే...
చెప్పండి ఏంకావాలో..!!
.మంత్రి-


పెద్ద కోరికేం కాదండీ.. ప్రమోషన్ ఇవ్వమని
మొక్కుకున్నా.. లడ్డూ ప్రసాదం తీసుకోండి..!!
ముఖ్యమంత్రి —

ఈ వారం కా'ర్టూన్స్'



పెరూ
దేశంలో వున్న ఈ పర్వతాన్ని
వినికుంకా మౌంటెయిన్ అంటారు.
సముద్ర మట్టానికి సుమారు ఐదు వేల
మీటర్ల ఎత్తులో వున్న ఈ పర్వతం
ఇంద్రధనుస్సును తలపిస్తుంది. పర్వతంపై
ఉన్న ఖనిజాల వల్ల ఇలా రంగుల
కొండగా కనిపిస్తుంది.